విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
నెలకు	రు 7-50	రు 8-10
3 నెలకు	22-50	24-30
6 నెలకు	44-00	47-60
సంవత్సరమునకు	88-00	95-20

ఆదివారంతో సహా దినపత్రిక 25 పైసలు

VISALAANDHRA Phone No. 75301 ఉదయం ★★★ Regd No H/VJ/47

విశాలాంధ్ర

గుణము పొదుపు
లక్షలాదులు సుపయోగించు
సాధారణము పాకెట్టు
అలమంటక్ నరముల బలవర్ధక టానిక్
ఉజాలా ఆరోగ్యమును వృద్ధిపరచును
బృంగామలక తైలము
మా స్టాకిస్టులుగా ఉండుట మీ కిష్టమేనా?

70 2049

సంపుటి 24 సంచిక 202 | విజయవాడ 30—10—74 బుధవారం | 4 పేజీలు 25 పైసలు

భారతదేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడానికి జయప్రకాశ్ సన్నద్ధం

బీహార్ ఉద్యమాన్ని కమ్యూనిస్టుపార్టీ అణచివేయడం తథ్యమని

శ్రీ చండ్ర రాజేశ్వరరావు హెచ్చరిక

బీహార్ షరీఫ్ అక్టోబరు 29

శ్రీ జయప్రకాశ్ నారాయణ ఉద్యమం భారతదేశ విచ్ఛిత్తికి దారితీసుందని, భారతదేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడానికి ఆయన సన్నద్ధమవుతున్నాడని భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు నేడిక్కడ హెచ్చరించారు.

కాంగ్రెసు సహకరించినా, సహకరించకపోయినా, జయప్రకాశ్ నారాయణ్ నిర్వహిస్తున్న విచ్ఛిన్నకర ఉద్యమాన్ని అణచివెయ్యడానికి కమ్యూనిస్టుపార్టీ నిశ్చయించుకుందని శ్రీ రాజేశ్వరరావు స్పష్టీకరించారు.

బీహారులో నిర్వహింపబడుతున్న ఉద్యమం దేశ విచ్ఛిత్తికి తోడ్పడుతుందని నిన్న యిక్కడ జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో ప్రసంగిస్తూ ఆయన హెచ్చరించారు అమెరికాకు భారతదేశాన్ని తాకట్టు పెట్టాలని జయప్రకాశ్ కోరుతున్నారనీ అందుచేతనే ఈ ఆందోళనను పెట్టుబడిదారులు దొంగవర్తకదారులు, స్మగ్లర్లు బలపరచి, ఆర్థిక సహాయం చేస్తున్నారని ఆయన తెలిపారు

శ్రీ నారాయణ్ ఉద్యమాన్ని కాంగ్రెస్‌లో వున్న అభివృద్ధినిరోధకశక్తులు అవినీతి పరులైన ఆ పీ సర్లు బలపరుస్తున్నారని శ్రీ రాజేశ్వరరావు చెప్పారు.

శ్రీ నారాయణ్ చేస్తున్న సవాలును ఎదుర్కోడానికి ముందుకు రావలసిందిగా ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీకి ఆయన విజ్ఞప్తిచేశారు,

వచ్చే నెల రెండవ వారంలో ప్రజా ప్రదర్శన

బీహార్ కాంగ్రెసు నిర్ణయం

పాట్నా అక్టోబరు 28

ప్రస్తుతం బీహార్‌లో జయప్రకాశ్ నారాయణ్ నడుపుతున్న ఉద్యమానికి వ్యతిరేకంగా నవంబర్ రెండవ వారంలో పాట్నాలో ప్రజాప్రదర్శన జరపాలని బీహార్ కాంగ్రెస్ నిర్ణయించింది

బీహార్ పి సి సి కార్యవర్గం క్యాబినెట్ మంత్రుల సంయుక్త సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోబడింది

కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ డి కె బారువా రైల్వేమంత్రి శ్రీ యల్ యన్ మిశ్రా కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

మేధావుల ఫోరం విజ్ఞప్తి

రాష్ట్రంలో ప్రస్తుతం నిర్వహింపబడుతున్న ఉద్యమ దుష్ఫలితాలను బహిర్గతంచేస్తూ "ప్రచార వారోత్సవాన్ని" నిర్వహించాలని బీహార్ మేధావుల ఫోరం నేడు నిర్ణయం తీసుకుంది

ఈ వారోత్సవం సందర్భంగా ప్రదర్శనలు సెమినార్లు జరపాలని కూడా నిర్ణయించింది

ఫోరం అత్యవసర సమావేశం శ్రీ కె కె తివారి అధ్యక్షతన నేడు జరిగింది

రాజ్యాంగయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని తొలగించి ఫాసిస్టు ప్రభుత్వాన్ని ఏర్పరచటమే ఈ ఉద్యమ లక్ష్యమని శ్రీ తివారి స్పష్టంచేశారు.

రాష్ట్రాన్ని ప్రస్తుత దశకు తీసుకువచ్చిన శక్తులను అధికారంనుండి తొలగించి ప్రగతిశీల భావాలు గల మేధావుల సహకారాన్ని తీసుకోవలసిందిగా ఈ సమావేశం కాంగ్రెస్ అధ్యక్షునికి విజ్ఞప్తి చేసింది.

మిశ్రావర్గంచే బలప్రదర్శన

పాట్నా, అక్టోబరు 28

రాష్ట్ర నాయకత్వంలో మార్పును కోరుతున్న మిశ్రా వర్గం ఏర్పాటు చేసిన టీ పార్టీకి మొత్తం 240 మంది కాంగ్రెస్ లెజిస్లేటర్లలో 150 మంది హాజరయ్యారు

కాంగ్రెస్ అధ్యక్షునితో చర్చలు ప్రారంభించే ముందు తమ బలప్రదర్శనను చూపేందుకు ఈ పార్టీ ఏర్పాటు చేయబడిందని యు యన్ ఐ వ్రాస్తున్నది

కాంగ్రెస్ లెజిస్లేచర్‌పార్టీ మాజీ నాయకులు శ్రీ రామ్‌లఖన్‌సింగ్ యాదవ్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు మిశ్రా వర్గానికి చెందినముఖ్యులు జగ్‌జీవన్‌రామ్; కేదార్‌పాండే మద్దతుదారులుహాజరయ్యారు

శ్రీ కేదార్‌పాండే హాజరు కాలేదు

కార్మికమంత్రి రామ్‌దులారిసిన్హా ఆహార శాఖ మంత్రి రామాశ్రయ ప్రసాద్‌సింగ్ విద్యామంత్రి రామ్‌రాజసింగ్ వ్యవసాయ మంత్రి జగన్నాధమిశ్రాతోసహా పలువురు మంత్రులు హాజరయ్యారు

నవంబరు 2వ మితవాద విద్రోహ వ్యతిరేక దినం

బలరామ్ పిలుపు

తిరువనంతపురం అక్టోబరు 29

నవంబరు 2వ తేదీన మితవాద విద్రోహ వ్యతిరేక దినం జరపాల్సిందిగా ప్రజాస్వామిక శక్తులందరికి కేరళరాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎన్ ఇ బలరాం పిలుపు యిచ్చారు

ఆరోజున సభలు, ప్రదర్శనలు జరపాలని ఆయన కోరారు

మార్క్సిస్టుపార్టీ ప్రారంభించనున్న ఆందోళన దేశవ్యాప్తంగా మితవాద అతివాద అవకాశవాదుల విద్రోహ కార్యక్రమంలో భాగమేనని ఆయన అన్నారు

నవంబర్ 3వ తేదీ ప్రదర్శనలు వాయిదా

తిరువనంతపురం అక్టోబరు 29

కేరళ మంత్రివర్గాన్ని కూలద్రోయడానికి ప్రజాస్వామికాన్ని విచ్ఛిన్నం చేయడానికి మార్క్సిస్టుపార్టీ పన్నిన కుట్రను వ్యతిరేకిస్తూ నవంబర్ 3 తేదీన ఐక్య సంఘటన కాంగ్రెసు సంధాన కమిటీ జరపదలచిన ప్రదర్శనలు ముస్లింలీగు కోర్కెమీదట వాయిదా వేసినట్లు రవాణాశాఖ మంత్రి శ్రీ యం. ఎన్ గోవిందన్ నాయర్ నేడిక్కడ తెలిపారు.

నవంబర్ 7వ జరిగే సంధాన కమిటీ సమావేశంలో ఇందుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు.

ఇదీ లోకం

నీళ్ళతోనడిచేమోటార్ ఇంజనట!
"వచ్చాంపో, అయితే నీరుగూడా కరువై పోబోతుందన్న మాట!"

విజయవాడ హత్యాకేసుల విచారణ

రాష్ట్ర సి ఐ డి శాఖకు అప్పగింత

హైద్రాబాద్ అక్టోబర్ 29

విజయవాడలో నిన్న జరిగిన అయిదు హత్యలకు సంబంధించిన కేసు విచారణను రాష్ట్ర క్రైమ్ బ్రాంచి (సి ఐ డి శాఖ)కి అప్పగించుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేడు ఉత్తర్వు జారీచేసింది

పోలీసు క్రైంబ్రాంచి సూపరింటెండెంటు శ్రీ పి జగన్మోహన్ డిప్యూటీ సూపరింటెండెంటు శ్రీ ఎమ్ వి రామచంద్రరావులను ఇందు నిమిత్తం నేడు విజయవాడకు పంపినట్లు పోలీసు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ వి శ్రీనివాసన్ యు ఎన్ ఐ వార్తా సంస్థకు తెలియజేశారు.

నిన్నటి హత్యల సందర్భంగా నేడు విజయవాడలో కొన్నిచోట్ల దుకాణాలు మూసివేసినట్లు ఇక్కడ తెలియవచ్చింది

కేంద్ర మంత్రులతో కిసింగర్ చర్చలు

న్యూఢిల్లీ అక్టోబరు 29

ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగమంత్రి కిసింగర్ నేడు కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ సి సుబ్రహ్మణ్యంతో చర్చలు జరిపారు

భారత ఆర్థిక పరిస్థితి ఆహారం విద్యుత్‌లకు సంబంధించి అంతర్జాతీయంగా ఎదురౌతున్న సమస్యలను వారు చర్చించారు

చర్చల అనంతరం శ్రీ సుబ్రహ్మణ్యం పత్రికల వారితో మాట్లాడుతూ చర్చలు ప్రయోజనకరంగా వున్నాయన్నారు

భారత్‌కు అమెరికా ఆర్థిక సహాయం విషయంపై నిర్దిష్టమైన చర్చ నేడు జరుగలేదు భారత అభివృద్ధి కార్యక్రమాలకు తమ ప్రభుత్వ మద్దతు వుండగలదని కిసింగర్ చెప్పారని ఆయన తెలిపారు

భారత ఆర్థిక వ్యవసాయ పారిశ్రామిక పరిస్థితిపైన రుణ చెల్లింపులపై తమ చర్చలు జరిగాయన్నారు

అంతర్జాతీయ ఆయిల్ సంక్షోభం ఆహార సమస్య కూడా వీరి చర్చలలో ప్రస్తావనకు వచ్చాయి త్వరలో జరుగనున్న ప్రపంచ ఆహారమహాసభ అందులో అవలంబించవలసిన వైఖరిని శ్రీ సుబ్రహ్మణ్యం వివరించారు

ఈ విషయంలో శ్రీ సుబ్రహ్మణ్యం ప్రతిపాదనలపట్ల కిసింగర్ అనుకూలతను వ్యక్తంచేశారు

చర్చలలో కిసింగర్‌కు భారత్‌లో అమెరికా రాయబారి మొయినిహాన్ సహాయపడగా శ్రీ సుబ్రహ్మణ్యంకు అమెరికాలో భారత రాయబారి టి యన్ కౌల్ ఆర్థికశాఖ కార్యదర్శి యం జి కౌల్ సహాయ కార్యదర్శి జె యస్ జైపాల్ సహాయపడ్డారు.

జగ్‌జీవనరామ్‌తో సంభాషణలు

కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్‌ను నేడుదయం కిసింగర్ కలుసుకొని చర్చలు జరిపారు

అంతర్జాతీయ ప్రత్యేకించి భారతఆహార పరిస్థితిపై వీరుచర్చించినట్లు తెలుస్తున్నది

చర్చలు 30 నిమిషాలపాటు జరిగాయి చర్చలు సౌహార్ద్రపూరిత వాతావరణంలో జరిగాయని శ్రీ జగ్‌జీవన్‌రామ్ చెప్పారు.

ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఆహార పరిస్థితి ఇందుకు భారత్ ఏవిధంగా సహాయపడగలదుఅనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి

చర్చల వివరాలను తెలిపేందుకు ఆయన నిరాకరించారు

ఈ చర్చలలో సహాయకులు ఎవరూ పాల్గొనలేదు

రక్షణమంత్రితో చర్చలు

భారత రక్షణమంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ అమెరికా విదేశాంగ మంత్రి కిసింగర్‌లు నేడు ద్వైపాక్షిక సమస్యలపై చర్చలు జరిపారు

వీరిద్దరిమధ్య చర్చలు గంటపాటుజరిగాయి చర్చలలో సహాయకులెవరూ పాల్గొనలేదు

శ్రీ స్వరణ్ సింగ్‌తో చర్చలు జరిపే అవకాశం కలగటంపట్ల కిసింగర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు

మా చర్చలు బాగా జరిగాయి ఉభయ దేశాల మధ్య సంబంధాలను మెరుగు పరచుకోవటం, పటుతరం చేసుకోవటంపై మేము ఒకరి అభిప్రాయాలను ఒకరు తెలుసుకున్నాము అని శ్రీ స్వరణ్‌సింగ్ చెప్పారు

రక్షణ రంగంలో భారత్ - అమెరికాల మధ్య సహకారంలేని విషయం ప్రతివారికి తెలిసిందే అందువల్ల రక్షణ వ్యవహారాలు మా చర్చలలో ప్రస్తావనకు రాలేదు అని ఆయనన్నారు.

అమెరికా అణ్వస్త్ర నౌకల రాకకు 100 మంది జపాన్ శాస్త్రవేత్తలు నిరసన తెలిపారు

బ్లఫ్‌మాస్టర్ "బడీ" హెన్రీ

అమెరికాలో నేమి, తదితర పాశ్చాత్య దేశాల్లో నేమి హెన్రీకిసింగరునొక ఇంద్రజాలికుడు గా అసమ మేధానిధి"గా ఒంటిచేతిమీద పాటిలేని సొంతశైలి దౌత్యపద్ధతి లోకల్లోలితప్రపంచాన్నికలత దీర్చి శాంతిని ప్రసాదిస్తున్న దూతగా పత్రికలు తదితర ప్రచారసాధనాలూ అభివర్ణిస్తున్నాయి. అయితే, యిటీవలి కాలంలో అతగాడు చేసిన ఆకతాయి పనులూ కోసినవి అడ్డకోతలూ అన్నీవెల్లడైపోయాక అతని గుణగానం కొంత తగ్గిందనుకోండి

ఇటీవలి కల్లోలాల్లో ఈ "శాంతి దూత" ప్రత్యేకించి సైప్రస్‌లో ఏం చేశాడో చూద్దాం: సైప్రస్ కుట్రకు వెనుకనున్న కుట్రదారు పాశ్చాత్య కిసింగరేనని సైప్రస్‌లో చట్టబద్ధమైన ప్రభుత్వాన్ని కూలద్రొయ్యడమే కాకుండా మకారియోస్‌ను హత్య చేయించడం కూడా అతగాడి ఎజెండాలో ఒక భాగమనీ బయటపెట్టినది మరెవ్వరో కాదు సాక్షాత్తూ ఆర్చిబిషప్ మకారియోసే!

ఇది మకారియోస్ ఒక్కడి అభిప్రాయమనుకునేరు ఫ్రెంచ్ దిన పత్రిక లెమాండేలో పనిచేసే అభిజ్ఞుడైన రాజకీయ వ్యాఖ్యాత ఎరిక్ రౌలో, కిసింగర్‌ను ఎండగడుతూ రాసిన వ్యాఖ్య (1974 అగస్టు 24వ తేదీ ది గార్డియన్ ఆదివారం అనుబంధంలో యిది పునర్ముద్రించబడింది) లో వెనకటి జార్జి పాపండ్రూమంత్రివర్గంలో సభ్యుడైన అయోనిస్ జిగ్డిస్ రాసిన యీ క్రింది మాటలను ఉల్లేఖించాడు: "ఆర్చ్‌బిషప్ మకారియోస్‌కు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్న సంగతి అమెరికా విదేశాంగమంత్రి హెన్రీ కిసింగరుకు జూలై 15కుముందేతెలుసు అంతేకాదు ఆ కుట్ర పథకానికి ఆయనే కర్తఅయినాకాకపోయినా కనీసం దాన్ని ఆయన ప్రోత్సహించాడని ఖచ్చితంగా చెప్పొచ్చు

ఆ పథకం పూర్తిగా అమలుజరగలేదన్న విషయం అందరికీ బాగా తెలిసినదే ఇందుకు ప్రతిగా, అమెరికా విదేశాంగ శాఖకూ, సి ఐ ఎ కీ దాసానుదాస ప్రాయమైన గ్రీక్ సైనిక ముఠా ప్రభుత్వం పేకమేడలా కుప్పకూలిపోయింది. దరిమిలా అధికారంలోకి వచ్చిన కారమాన్లిస్ ప్రభుత్వం ప్రజల ఒత్తిడి ఫలితంగా కొంత ప్రజానుకూలంగా వ్యవహరించింది దానితో కిసింగర్ బాణీ అమెరికన్ దౌత్యనీతి కాళ్ళకింద యిసుక కరిగిపోయింది గ్రీసు నాటో కూటమినుంచి నిష్క్రమించే దాకా వెళ్ళింది వ్యవహారం గ్రీసులో కొన్ని ప్రజాతంత్ర పద్ధతులు అమల్లోకి వచ్చాయి!

సైప్రస్ కుట్రద్వారా సాధిద్దామని ఆశించి విఫలమైన దాన్ని టర్కీని ఎరిమీదకు స్వేచ్ఛగా వదలడంద్వారానైనా సాధిద్దామన్న ఎత్తు వేశాడు కిసింగర్ పాపం ఆ ఎత్తులోనూకిసింగర్ చిత్తే అయ్యాడు! టర్కీ సైనికశక్తిని పెంపొందించాలన్న కిసింగర్ ప్రయత్నానికి పురిట్లోనే సంధికొట్టింది ఎజెవిట్ పదవీచ్యుతుడయ్యాడు అమెరికన్ సెనేట్‌లో టర్కీకి అమెరికా ఆయుధ సహాయం బిల్లుకు తీవ్రమైన ప్రతిఘటన ఎదురైంది కిసింగర్ ప్రతిష్ఠను ఎలాగో ఒకలాగ దోటుపెట్టి నిలబెట్టాలని ప్రెసిడెంట్ ఫోర్డు వీటో ప్రయోగించితేగాని ఆ బిల్లు ప్యాసయ్యేందుకు గతి లేక పోయింది

చివర కేలాగైతేనేం తుది తగవుగా, అక్టోబరు 17 నుండి డిసెంబరు 10దాకా టర్కీకి అమెరికా ఆయుధ సహాయం కొనసాగవచ్చునన్నారు అయితే అలా తమకు లభించిన ఆయుధాలను టర్కీ, సైప్రస్‌కు పంపరాదని మాత్రం ఒక హంసపాదు పెట్టారు

అయితే తనకు లభించిన అమెరికన్ ఆయుధాలను టర్కీ సైప్రస్‌పై దురాక్రమణకు గ్రీక్‌పై న్యాయానికి వ్యతిరేకంగా వాడనే వాడింది మామూలుగా అయితే అమెరికన్ చట్టం ప్రకారం అమెరికన్ ఆయుధ సహాయం నిలిచిపోయి వుండాల్సింది కాని ఫోర్డు, కిసింగర్‌లు అమెరికన్ పార్లమెంటును కట్టుకొని చట్ట విరుద్ధమైన ఈ ఆయుధ సహాయాన్ని కొనసాగిస్తూనే వున్నారు.

అమెరికన్ పార్లమెంటు తనుచేసిన చట్టాన్ని తానే కాపాడుకోవడంలో విఫలమైనప్పటికీ ఒక్క విషయం మాత్రం స్పష్టపడింది అక్టోబరు 21వ తేదీ న్యూస్ వీక్ స్పష్టంగా యిలా రాసింది "విదేశాంగ మంత్రి మాటను అంతకంతకు ఎక్కువమందిపార్లమెంటు సభ్యులు (సెనేటర్లు) విశ్వసించలేని స్థితిలో పడుతున్నారు."

సైప్రస్‌లో కిసింగర్ తలపెట్టిన కుట్రకాస్తా తుడుచుకుపోయింది అప్పుడిక అతగాడు గ్రీకులకు అనుకూలంగా మొగ్గు చూపాడు అదీ పని చెయ్యకపోయేసరికి, అతను టర్కీ వంక మొగ్గుచూపాడు అయితే అమెరికాకు సంబంధించినంతవరకు ఖచ్చితమైన ఫలితాలేమీ చేతికి అందలేదు అమెరికా ఆధ్వర్యాన సైప్రస్‌సమస్యపరిష్కరింపబడటమంటూజరుగుతుందన్నభ్రమఇప్పుడికఎవరికీమాత్రంమిగల్లేదు కాగాపోగా కిసింగర్ నేతృత్వాన అమెరికా చేస్తున్నదేమిటంటే టర్కీ ఆయుధ శక్తిని పెంపొందించడం తద్వారా సైప్రస్ విభజనసాధించడమూను ఓహోహో ఏం గొప్ప శాంతిదూతండీ కిసింగర్

జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమ ప్రతిఘటనకు బీహార్‌కాంగ్రెస్ నిర్ణయం

అధ్యక్షుడు బారువా సమక్షంలో సమావేశం

పాట్నా, అక్టోబరు 29

సర్వోదయ నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంక్రింద నిర్వహింపబడుతున్న ఆందోళనకు వ్యతిరేకంగా నిర్విరామంగా పోరాటం జరపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ డి కె బారువా సమక్షంలో బీహారు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కాంగ్రెసు లెజిస్లేచర్‌పార్టీ, బీహారు నుంచి ఎన్నికైన కాంగ్రెసు పార్లమెంటు సభ్యుల సంయుక్త సమావేశం నేడు ఏకగ్రీవంగా నిర్ణయించింది

దేశంలో ప్రజాస్వామ్యాన్ని తుడిచి పెట్టేందుకు కాంగ్రెసు నామరూపాలు లేకుండా చెయ్యడానికే జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వం వహించి నిర్వహిస్తున్న ఉద్యమం ఉద్దేశించబడిందనీ, చివరివరకు ఆ ఉద్యమానికి వ్యతిరేకంగా పోరాడ్డంతప్ప మనకు మరో మార్గంలేదు"నీ బారువా ఆ సమావేశంలో వివరించిన అనంతరం పై నిర్ణయం చేశారు

ప్రస్తుత పరిస్థితుల్లో రెండే రెండు మార్గాలు వున్నాయి జయప్రకాశ్ నారాయణ్‌తో కాంగ్రెసు చర్చలు ప్రారంభించి ఆయనతో రాజీపడటం మొదటిది దీని అర్థం ఏమిటంటే శాసనసభను రద్దు పరచడమే జయప్రకాశ్ ఆందోళనకు వ్యతిరేకంగా పోరాడి ప్రజాతంత్ర వ్యతిరేక కాంగ్రెసు వ్యతిరేక శక్తులను ఓడించడం రెండవ మార్గం.

సభ్యులు ఏ మార్గాన్ని చేబడతారో తెలియచేయవలసిందిగా బారువా కోరగానే "మేం ప్రతిఘటించి పోరాడదలుచుకున్నాం" అని సమావేశంలోని సభ్యులు యావన్మందీ ముక్తకంఠంతో చాటారు

ఆందోళనకు వ్యతిరేకంగా పోరాడేందుకు కాంగ్రెసుకు కల ఒకే ఒక ఆయుధంసంఘటిత శక్తి మాత్రమేననీ అందుచేత కాంగ్రెసు వాదులందరూ క్రమశిక్షణతోను ఐక్యంగాను వుండవలసిందిగా బారువా విజ్ఞప్తి చేశారు

పార్టీలో వున్న కొద్దిపాటి విభేదాలకు తాను ప్రాధాన్యత యివ్వడంలేదనీ సవాలును ఎదుర్కోవలసి వచ్చినప్పుడల్లా ప్రత్యేకించి బీహారు కాంగ్రెసువాదులు ఐక్యంగా నిలబడ్డం సంప్రదాయమనీ ప్రజా ప్రదర్శనలు సభలు జరపడంద్వారా కాంగ్రెసు ప్రతిష్ఠ పెరుగుతుందనీ ప్రజలు తప్పనిసరిగా కాంగ్రెసునే బలపరుస్తారనీ ఆయన అన్నారు

పార్టీతో సహకరించని కాంగ్రెస్‌వాదులు క్రమశిక్షణా చర్యలకు గురికావలసివస్తుందనీ అంతేకాకఅట్టివారికి కాంగ్రెసుపార్టీలోస్థానం వుండదనీ ఆయన స్పష్టీకరించారు

ఇటీవల జయప్రకాశ్ రాజస్థాన్ ఉత్తర ప్రదేశ్ పంజాబ్‌లలో జరిపిన పర్యటనలను గురించి ప్రస్తావించి బీహారుకి మాత్రమే తన ఉద్యమాన్ని పరిమితంచేసే ఉద్దేశం జయప్రకాశ్‌కు లేదని రుజువవుతోందని అన్నారు ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేసి దేశంలో కాంగ్రెసును లేకుండా చేయడమే ఆ ఉద్యమ లక్ష్యమని స్పష్టం అవుతోందనీ చెప్పారు

ఆందోళన సందర్భంగా కాంగ్రెసు కమ్యూనిస్టుపార్టీ హింసాకార్యలు జరిపాయన్న సర్వోదయ నాయకుని ఆరోపణకు సమాధానం చెబుతూ అటువంటి పరిస్థితి ఏర్పడకుండా బాధ్యత వహించవలసిన నైతిక విధి జయప్రకాశ్ దేనని బారువా స్పష్టం చేశారు చౌరీ చౌరాలో హింస జరిగినతర్వాత గాంధీమహాత్ముడు నిర్వహించిన పాత్రను ఆయన యీ సందర్భంగా గుర్తుచేశారు

నాయకత్వంలో మార్పు జరగదు

బీహారు కాంగ్రెస్ నాయకత్వంలో తక్షణమే ఎల్లాంటి మార్పులు జరగబోవని కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ డి కె బారువా నేడిక్కడ తెలిపారు

బీహారు కాంగ్రెస్ కమిటీ లెజిస్లేచర్ పార్టీ సభ్యుల పార్లమెంటు సభ్యుల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ ఇల్లు తగలబడిపోతుంటే దానిని ఆర్పడమే ప్రతి కాంగ్రెసు కార్యకర్త కర్తవ్యం అని ఆయన అన్నారు

రాష్ట్రంలో ప్రస్తుత ఆందోళనను ముందు జయప్రదంగా ఎదుర్కోవాలి ఆ తరువాతనే మిగతా విషయాలు చర్చించవచ్చునని తెలిపారు.

విల్సన్ ప్రభుత్వ ప్రయత్నం

భారత్‌తో మంచి సంబంధాలకై

లండన్ అక్టోబరు 29

భారత్‌తో మంచి సంబంధాలను పునరుద్ధరించుకోవటానికి విల్సన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని యిక్కడి అధికారులు నేడు తెలియజేశారు

రాణి ఎలిజబెత్ తరపున నేపాల్ రాజు బీరేంద్ర పట్టాభిషేకానికి 1975లో హాజరు కానున్న ప్రిన్స్ చార్లెస్ ఆ తరువాత న్యూఢిల్లీ యింకా ఉపఖండంలో యితర ప్రాంతాలను సందర్శించటానికి తాత్కాలిక ఏర్పాట్లు జరిగాయి

అంతేకాదు ఈ నెల 31న లండన్‌లో జరిగే వి. కె కృష్ణమీనన్ స్మారక సభకు ప్రధాని విల్సన్ ఆయన మంత్రివర్గసభ్యులు హాజరౌతారని తెలియవచ్చింది

సచివాలయం ముందు ధర్నా

హైదరాబాద్ అక్టోబరు 29

కేంద్రం జారీచేసిన వేతన స్తంభన ఆర్డినెన్సువల్ల నిరసనను వ్యక్తంచేస్తూనేడిక్కడ సచివాలయంముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల ప్రతినిధులు ట్రేడ్ యూనియన్‌ల కార్యకర్తలు ధర్నా జరిపారు

ఇందుకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణను గురించి చర్చించేందుకు వివిధ ట్రేడ్‌యూనియన్ల ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సదస్సు వచ్చేనెల 3వ తేదీ ఇక్కడ జరుగుతుందని ఉద్యోగుల ప్రతినిధి ఒకరు చెప్పారు

కర్నూల్ కలెక్టర్ కార్యాలయంముందు కూడా ఇదే విధంగా ధర్నా జరిగినట్లు ఇక్కడకు సమాచార మందింది.

ప్రధాని శ్రీనగర్ రాక

శ్రీనగర్; అక్టోబరు 29

కాశ్మీర్‌లో మూడు రోజులపాటు పర్యటించే నిమిత్తం ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ నేటి ఉదయం యిక్కడకు ప్రత్యేక వాయుసేన విమానంలో వచ్చారు

ఫ్రాన్స్‌లో పౌర జీవనం స్తంభన

పోస్టల్ సమ్మెవల్ల

పారిస్ అక్టోబరు 29

ఫ్రాన్స్‌లో గత వారంరోజులుగా జరుగుతున్న పోస్టల్ సమ్మెవల్ల పౌరజీవితం స్తంభించిపోయింది

3 80 000 మంది పోస్టల్ ఉద్యోగులలో 1 00 000 మంది ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు ఉత్తరాలు మనీయార్డర్ల బట్వాడా పూర్తిగానిలిచిపోయింది హెచ్చు వేతనాలు, మెరుగైన పని పరిస్థితుల డిమాండ్‌పై సమ్మె జరుగుతున్నది

తాజుదీన్ రాజీనామా

బంగ్లాదేశ్ పత్రికల హర్షం

ఢాకా అక్టోబరు 28

బంగ్లాదేశ్ ఆర్థికమంత్రి తాజుద్దీన్ రాజీనామా చేయటంపట్ల పలు స్థానిక పత్రికలు హర్షం వ్యక్తం చేశాయి

ప్రస్తుత ఆర్థిక దుస్థితికి అతనే కారణమని ఆర్థిక వ్యవహారాలను సక్రమంగా నిర్వర్తింపటంలో ఆయన విఫలమయ్యారని ఈ పత్రికలు పేర్కొన్నాయి

శ్రీ అహ్మద్ అనుసరించిన విధానాలను ప్రభుత్వ ప్రైవేట్ పత్రికలు అన్ని విమర్శించాయి

లూనా- 23 ప్రయోగం

మాస్కో అక్టోబరు 28

స్వయంచలిత అంతరిక్షనౌక లూనా 23ను చంద్రగ్రహ పరిశోధన నిమిత్తం సోవియట్ యూనియన్ నేడు ప్రయోగించినట్లు టాస్ వార్తాసంస్థ తెలియజేసింది.

ఇది చంద్రుని దిశగా సజావుగా సాగిపోతున్నదని తెలిసింది లూనా 23 కదలికను భూమిపై నుండే కంట్రోలు చేస్తారు

గత మేలో ప్రయోగించిన లూనా 22 చంద్రోపరితలాన్ని టెలివిజన్ కెమెరా ద్వారా పరిశీలించింది. అంతకుముందు ప్రయోగించిన లూనా తనతో తీసుకొనిపోయిన చంద్ర నౌకను చంద్రునిపై దించింది. అది అక్కడ శిలలను సేకరించింది

అమెరికా వ్యతిరేక ప్రదర్శన

మద్రాసులో

మద్రాసు అక్టోబరు 28

ఎ ఐ టి యు సి తో సహా వామపక్ష ట్రేడ్‌యూనియన్లకు చెందిన 40 మంది నేడిక్కడ అమెరికా కాన్సలేట్ కార్యాలయం ఎదుట ప్రదర్శన జరిపారు

అమెరికా వ్యతిరేక, కిసింగర్ వ్యతిరేక నినాదాలిచ్చి వెళ్ళారు ప్రదర్శన శాంతియుతంగా జరిగినట్లు పోలీసులు చెప్పారు.

కొసిగిన్ ప్రకటనపట్ల ఆఫ్ఘన్ హర్షం

న్యూఢిల్లీ అక్టోబరు 28

శాంతియుత సహజీవనం ప్రాతిపదికగా శాంతియుతంగా తమ అభిప్రాయభేదాలను పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్‌లు పరిష్కరించుకోవాలని సోవియట్ ప్రధాని అలెక్సీ కొసిగిన్ ఇటీవలచేసిన ప్రకటనను ఆఫ్ఘనిస్తాన్ హర్షించినట్లు కాబూల్ రేడియో తెలియజేసింది.

వివాదాలను సంప్రదింపుల ద్వారానూ, శాంతియుత పద్ధతులద్వారానూ పరిష్కరించుకోవాలని కొసిగిన్ చేసిన సూచన ఆఫ్ఘనిస్తాన్ విధానాలకు పూర్తిగా అనుగుణమైనదని ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి అన్నారు దీనికి సంబంధించి పాక్ సోవియట్‌లు విడుదల చేసిన సంయుక్త ప్రకటనను ఆయన ఉటంకించారు

హెచ్ యం. టి లాంపుల తయారీ విభాగ వార్షికోత్సవం

హైద్రాబాద్ అక్టోబరు 28

ఇక్కడి హెచ్ యం టి. లోని లాంపుల తయారీ విభాగం వార్షికోత్సవం బుధవారం నాడు జరుగుతుంది.

పాలస్తీనా రాజ్యం ఏర్పాటుకు విముక్తి సంఘటనకు అధికారం

అరబ్ శిఖరాగ్ర సమావేశం ఆమోదం

రాబట్ అక్టోబరు 28

స్వతంత్ర పాలస్తీనా రాజ్యాన్ని ఏర్పాటు చేసే ప్రత్యేక హక్కును పాలస్తీనా విముక్తి సంఘటనకు యిస్తూ నేడిక్కడ అరబ్ శిఖరాగ్ర సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఈ తీర్మానాన్ని చివరివరకూ ప్రతిఘటించిన జోర్డాన్ ఆఖరి నిముషంలో తన ప్రతిఘటనను ఉపసంహరించుకొని ఏకగ్రీవ తీర్మానానికి దోహదం చేసింది.

21 దేశాల అరబ్ శిఖరాగ్ర సమావేశం చేసిన ఈ నిర్ణయం అమెరికాకు పరాజయంగనూ, పాలస్తీనా విముక్తి సంఘటనకు గొప్ప దౌత్యపరమైన విజయంగానూ సమావేశవర్గాలు తెలియజేశాయి

ఈ నిర్ణయంవల్ల అరబ్ ఇజ్రాయిల్‌లు జరుపనున్న శాంతి చర్చలకు ఊతం ఏర్పడవచ్చు ఎందుచేతననగా విముక్తి సంఘటనను వ్యక్తిగత హింసావాదుల ముఠాగా అది పేర్కొంటున్నది.

జోర్డాన్ మొదటిసారిగా పాలస్తీనా విముక్తి సంఘటనను పాలస్తీనా రాజ్యాన్ని ఏర్పాటు చేయటానికి ఏకైక చట్టబద్ధమైన సంస్థగా గుర్తించింది.

జోర్డాన్‌నదికి పశ్చిమ ఒడ్డునగల పాలస్తీనా ప్రాంతంపై తనకు హక్కు గలదని గతంలో జోర్డాన్ పట్టుబట్టింది ఈ ప్రాంతాన్ని 1967 లో జరిగిన పశ్చిమాసియా యుద్ధంలో జోర్డాన్ నుండి ఇజ్రాయిల్ స్వాధీనం చేసుకున్నది.

మొరాకో అల్జీరియా ఈజిప్టు సౌదీ అరేబియా సిరియా దేశాలుగల కమిటీ చేసిన గణనీయమైన కృషివల్ల కీలకమైన ఈ అంశాలపై ఒక అంగీకారం కుదిరిందని సమావేశ వర్గాలు తెలియచేశాయి

జోర్డాన్‌నది పశ్చిమ ప్రాంతాన్ని యిజ్రాయిల్ వదులుకున్నప్పుడు అది నేరుగా పాలస్తీనా విముక్తి సంఘటనకు అందచేయాలనే సూత్రాన్ని జోర్డాన్‌రాజు అంగీకరించారు

జోర్డాన్‌నది పశ్చిమ ప్రాంతాన్ని ఇజ్రాయిల్‌నుండిపొందటానికిఅరబ్‌రాజ్యాలు జోర్డాన్‌కు పూర్తి అధికార మివ్వాలని తరువాత తమ భవితవ్యాన్నినిర్ణయించుకునే అధికారం ఆ ప్రాంత ప్రజలకు వదిలి వేయాలని జోర్డాన్ రాజు వాదిస్తూ వచ్చారు

జెనీవాలో జరిగే శాంతి సమావేశంలో జోర్డాన్ ప్రతినిధివర్గంలో భాగంగా వుండి యిజ్రాయిల్‌నుండి జోర్డాన్ నది దక్షిణ ప్రాంతాన్ని పొందటంలో జోర్డాన్ పాత్రను గుర్తించటానికి యాసర్ అరాఫత్ నాయకత్వాన గల పాలస్తీనా విముక్తి సంఘటన అంగీకరించింది ఈవిధంగా శిఖరాగ్ర సమావేశం నిర్ణయంవల్ల జోర్డాన్, పాలస్తీనా విముక్తి సంఘటనలు తమకు రాయితీలు లభించినట్టు భావిస్తున్నాయి

ఈవిధంగా పాలస్తీనా విముక్తి సంఘటనకు అరబ్‌రాజ్యాల పూర్తి గుర్తింపు లభించింది.

విశాలాంధ్ర

1974 అక్టోబరు 30 బుధవారం

అమెరికా అణ్వస్త్ర నౌకల రాక : జపాన్ శాస్త్రవేత్తల నిరసన

ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాలలో జోక్యం కల్గించుకోడానికి తమకు హక్కున్నదని అమెరికా సామ్రాజ్యవాదులు బాహాటంగానే చెబుతున్నారు. అందులో దాపరికమేమీ లేదు

వియత్నామ్‌లో అమెరికా ప్రత్యక్ష జోక్యం - వియత్నామ్ గడ్డపై దాదాపు రెండు దశాబ్దాల కాలం అది సాగించిన అతి ఘోరమైన దురాక్రమణయుద్ధం ప్రపంచ ప్రజలందరి జ్ఞాపిలో నుండి ఎన్నటికీ తొలగిపోదు ఆసియా వాసులను ఆసియా వాసుల ద్వారానే హతమార్చాలనే అమెరికా దుష్ట రాజకీయ నీతి వియత్నామ్ ప్రజల విజయంతో చావుదెబ్బ తిన్నప్పటికీ ఈ నాటికీ ఇండో-చైనాలో ఆ నీతిని కొనసాగించుతూనే ఉంది పారిస్ ఒప్పందం అమలు జరుగకుండా ఉండటానికి అమెరికా కీలుబొమ్మలకు అది యింకా యిస్తున్న సైనిక, ఆర్థిక సహాయమే కారణం.

అమెరికా తన అణ్వస్త్ర పాటవాన్ని చూపి తటస్థ దేశాలను, బడుగు దేశాలను కడకు తన ఉపగ్రహ దేశాలను ఎంత బెదిరించి లొంగదీయాలనుకున్నా సోవియట్ బలం ముందు అది ఎందుకూ కొరగాకుండా పోయినందుననే చివరకు ఈ సమస్యపై పరిమిత ఒప్పందాలకు రాక తప్పలేదు అయినప్పటికి అమెరికా సామ్రాజ్యవాదులు మెడిటరేనియన్‌లో, పసిఫిక్‌లో తమ అణ్వాయుధ నౌకా బలాల విన్యాసాలు జరుపుతూ తన ప్రాబల్యాన్ని, ఆయా ప్రాంత దేశాలలో ఉద్రిక్తతను కొనసాగించ జూస్తున్నది ప్రపంచమంతటా గల తన యుద్ధ స్థావరాలను అణు విమాన బలగాలతో నింపుతూనే ఉంది. జపాన్ రేవులకు అణ్వస్త్రాలతో కూడిన అమెరికా నౌకలను పంపడం బెదిరించి లొంగదీసుకొనే అమెరికా విదేశాంగ నీతిలో భాగమే

కాని ఆయాదేశాలలో అమెరికా విదేశాంగ నీతికి చుక్కెదురు అవుతూంది జపాన్ శాస్త్రజ్ఞులు 100 మంది అమెరికా అణ్వస్త్ర నౌకల రాకకు తీవ్ర నిరసన తెలుపుతూ ప్రకటనలు చేశారు ఒకినావాను అమెరికా అణ్వస్త్రాల స్థావరంగా కొనసాగనియరాదన్న ఆందోళన ఈనాటిదికాదు

జపాన్ ఈ నాటికీ అమెరికా ఉపగ్రహ రాజ్యంగా కొనసాగుతున్నప్పటికీ అమెరికా దురాక్రమణ యుద్ధ నీతిలో అణ్వస్త్రాల ఉత్పత్తిలో, పరీక్షలలో తమ దేశం భాగస్వామి కారాదన్న ప్రజాతంత్ర ఉద్యమం జపాన్‌లో నానాటికీ పెల్లుబుకుతూంది

అమెరికా "శాంతి ప్రియత్వం" గురించి, సౌహార్దతల గురించి అమెరికా విదేశాంగమంత్రి డాక్టర్ హెన్రీ కీసింగర్ నేడు భారత దేశ పర్యటన సందర్భంలో ఎన్ని మాయమాటలు చెప్పినప్పటికీ ఇదే క్షణంలో జపాన్ తీరంలో ఉన్న అమెరికా అణ్వస్త్ర నౌకలపట్ల జపాన్ శాస్త్రజ్ఞుల నిరసన కీసింగర్ దుష్ట విదేశాంగ నీతి నిజస్వరూపాన్ని బహిర్గతం చేస్తూనే ఉంది !

ప్రధాని నిరాకరణ
వర్ఘీస్ తొలగింపుదృష్ట్యా తనపై వచ్చిన విమర్శకు

న్యూఢిల్లీ అక్టోబరు 28

న్యూఢిల్లీ హిందుస్థాన్ టైమ్సు పత్రిక సంపాదకుడు శ్రీ బి జి వర్ఘీసను గురించి ఆ పత్రిక యజమానులతో తాను ఎన్నడూ ఏమీ చెప్పలేదని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చెప్పారు ఆ పత్రిక మేనేజిమెంటు వర్ఘీసను ఉద్యోగం నుండి తొలగించినట్లు తెలుస్తోంది

ఆ పత్రిక సంపాదకుణ్ణి ఉద్యోగం నుండి తీసివేయించడం ద్వారా తాను పత్రికాస్వాతంత్ర్యం కుత్తుకనులిమివెయ్యాలని ప్రయత్నిస్తున్నట్లు తనపై చేస్తున్న విమర్శను ఒక అమెరికన్ వారపత్రికకు చెందిన క్రిస్టియన్ నాయకుల బృందంతో మాట్లాడుతూ ప్రధాని ఖండించారు

అనేక పత్రికలలో వచ్చిన పై విమర్శపై ఆమె బహిరంగంగా వ్యాఖ్యానిస్తూ ఆపత్రిక తన కుమారునిపై ఏదో ఒక ప్రకటన చేసిందనీ ఆమె చెప్పారు. ఆ అంశంపైనే పార్లమెంటులో చర్చ జరిగింది ఇతర పత్రికలు కూడా అదే విషయాన్ని ప్రకటించాయి

భారతదేశ సమస్యలను ప్రస్తావించి, వ్యవసాయాన్ని అభివృద్ధి పరచడం పారిశ్రామిక ఉత్పత్తి అధికం చెయ్యడంద్వారానే పేదరికాన్ని తొలగించగలమని ఆమె చెప్పారు కేవలం అధికోత్పత్తి చెయ్యడం ఒక్కటే చాలదనీ సామాజిక న్యాయాన్ని దృష్టిలో వుంచుకుని ఆ ఉత్పత్తిని సమానంగా పంపిణీ చెయ్యాలనీ ఆమె చెప్పారు

1966 వ సంవత్సరంలో ఉత్తర భారత దేశంలో వివిధ రూపాలలో రైతాంగానికి సహాయం చెయ్యడం ద్వారా రైతాంగం ధనికులయారనీ సంఘంలో ఉద్రిక్తత ప్రవేశపెట్టారనీ ఆమె చెప్పారు పరిశ్రమలలో కూడా కొంతమంది చాలా భాగ్యవంతులయారు గత రెండు దశాబ్దాలపాటు అమలు జరిగిన ప్రణాళికలలో ధనవంతులు మరింత ధనికులు అయారనీ పేదవారు మరింత నిరుపేదలయారనీ చెప్పడం సరికాదని అన్నారు వాస్తవం ఏమిటంటే, పేదలు తమ హక్కుల విషయంలోను, ఆర్థికపరిస్థితులదృష్ట్యా మరింత చైతన్యవంతులయారని చెప్పారు

భారతదేశం పెద్ద దేశం అయినందువల్ల వివిధ రాష్ట్రాలు మండలాలు వుండడం అభివృద్ధిస్థాయికి భిన్నంగా వుండడంవల్ల దేశంలో ఆర్థిక ప్రగతి దృష్ట్యా ప్రత్యేక సమస్యలు తలెత్తాయని ఆమె అన్నారు.

ప్రపంచంలో పరస్పరావగాహన సృష్టించేందుకు మహిళలు ఎంతగానో కృషిచెయ్యాలని చెప్పారు ప్రతిదేశానికీ ఒక్కొక్క ప్రత్యేకత వుంటుందనీ ఆ ప్రత్యేకత అభివృద్ధి చెందవలసిందేననీ అన్నారు ఒకరితో స్నేహం మరొకరితోగలస్నేహానికి అభ్యంతరకరం కాదనీ ఆమెతెలిపారు

కలరాను అదుపులో పెట్టడంలో విజయం
డా॥ కరణ్‌సింగ్ వెల్లడి

హైదరాబాదు, అక్టోబరు 28

మలేరియా లాగే కలరా నిరోధక వాక్సిన్‌తో కలరాను అదుపులోకి తీసుకురావడం నూతన స్థాయికి చేరుకుందని కేంద్ర ఆరోగ్యమంత్రి డాక్టర్ కరణ్‌సింగ్ నేడు ఇక్కడ చెప్పారు

వ్యాధి నిరోధకమందులు ఉత్పత్తిచేసే సంస్థలో నెలకొల్పిన కలరా పరిశోధన విభాగాన్ని ప్రారంభిస్తూ కలకత్తా కేంద్రంలో నిర్వహిస్తున్న పరిశోధన కార్యకలాపాలను యీ విభాగంలో చేసే పరిశోధనలు మరింత ప్రయోజనకరంగా వుండేట్లు చేస్తాయని అన్నారు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రత్యేకప్రాధాన్యత యిస్తుందని చెప్పారు కేంద్రం చేబట్టే కుటుంబ నియంత్రణ కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు

వాస్తవిక కళను ఆధునికచిత్రకారులు అధ్యయనం చేయాలి
శ్రీ సంజీవదేవ్ విజ్ఞప్తి

విజయవాడ అక్టోబరు 28

వర్తమాన చిత్రకారులు సాంప్రదాయక వాస్తవిక చిత్రకళపై అధ్యయనం అవగాహనతో ఆధునిక కళను సృష్టించాలని ప్రముఖ చిత్రకారులు సంజీవదేవ్ నేడిక్కడ అన్నారు

సోవియట్‌విజన్ హాలులో యువ చిత్రకారుడు జనార్దన్ (జెమ్ని) చిత్రకళా ప్రదర్శన ప్రారంభోత్సవసందర్భంగా ఆయన ప్రసంగించారు తన చుట్టూవున్న ఆర్థిక రాజకీయ సాంఘిక పరిస్థితులనుండి కళాకారుడు వేరు పడరాదనీ అలాగే కేవలం ప్రచార కళను సృష్టిస్తే విలువలు వుండబోవనీ అన్నారు వాస్తవిక వాదాన్ని అలవరుచుకున్న తర్వాతనే సాంప్రదాయాలను ఛేదించి నైరూప్య కళనుగానీ, ఇంకేదైనా గాని సృష్టించినపుడు అది శక్తివంతంగా వుండగలదన్నారు సామాజిక ప్రయోజనం గల చిత్రాలను రసాత్మకంగా సృష్టించాలన్నారు

అంతకుముందు ప్రభుత్వ పాఠ్యగ్రంథాల ట్రస్టుడైరెక్టర్ శ్రీరాజు,ఆకాశవాణిడైరెక్టర్ శ్రీ రజనీ కాంతరావు ప్రసంగించారు

శతాబ్దాల నాటి సాంప్రదాయక కళను అలవరుచుకోవడానికి రాకెట్ యుగపు కళాకారుడికి వ్యవధి లేదని చిత్రకారుడు జనార్దన్ అన్నారు ఆంధ్ర అకాడమీ ఆర్ట్సు కార్యదర్శి శ్రీ మూర్తి వందన సమర్పణతో సభ ముగిసింది

ప్రదర్శనలోని 32 చిత్రాలలోఅత్యధికంగా మోనోగ్రాఫ్‌లు కొన్ని నూనెరంగుల చిత్రాలు వున్నాయి గ్రామీణ ప్రకృతి దృశ్యాలు ప్రధానంగా చిత్రించబడ్డాయి 31 వ తేదీ వరకూ రోజూ సాయంత్రం 4 9 గంటల మధ్య ప్రదర్శన వుంటుంది

విమానాలు మారిన ప్రయాణీకుల లగేజీ

భావనగర్, అక్టోబరు 28

బొంబాయినుండి భావనగర్‌కు నిన్న ఉదయం ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణంచేసిన 44 మంది ప్రయాణీకుల లగేజీలు తప్పిపోయాయి

ఈ లగేజీలు బొంబాయి హైదరాబాద్ విమానంలో తీసుకుపోబడ్డాయి

ఇండియన్ ఎయిర్‌లైన్స్ మేనేజర్ శ్రీ ఎన్ వి దేశాయ్ లగేజీలనేడుతిరిగివస్తాయని, ప్రయాణీకులకు పంపబడ్తాయని చెప్పారు

స్మగ్లర్ల రిట్‌కు హైకోర్టు అనుమతి

బొంబాయి అక్టోబరు 28

అంతరంగిక భద్రతాశాసనం (మిసా) క్రింద నిర్బంధించటాన్ని సవాలుచేస్తూ వచ్చిన ఆరు హెబియస్ కార్పస్ రిట్ పిటీషన్లను నేడిక్కడ బొంబాయి హైకోర్టులో న్యాయమూర్తులు శ్రీ విమదలాల్, శ్రీ గాంధీ స్వీకరించారు

మిసాను, సవరించబడిన ఆర్డినెన్సును సవాలు చేస్తూ రామ్‌లాల్ నరంగ్ రజబల్లి హిర్జీ మేఘానీ చంపాలాల్ పి షా నైన్మన్ పుంజాజీషా నికేష్ ప్రవీణ్‌చోక్సీ అలిక్‌చంద్ర దాలాకియా యీ పిటీషన్లను దాఖలు చేశారు

మిసాను సవరించబడిన ఆర్డినెన్సును సవాలుచేస్తూ హాజీమస్తాన్ గామంది రామ్ గోవానీ శివశంకర్‌లాల్‌గుప్తా సుకూర్‌నరాన్ భాకియా యూసఫ్‌పటేల్ వర్ధన్ మునిస్వామి (అంతా నిర్బంధంలోని స్మగ్లర్లు) తరపున బొంబాయి హైకోర్టులో గతవారం రిట్ పిటీషన్లు దాఖలు చేయబడ్డాయి

కిలో బంగారం స్వాధీనం

దక్షిణ బొంబాయి బులియన్ మార్కెట్ ఏరియాలోని జవేరీ బజార్‌లో ఒక ప్రైవేట్ బులియన్ రిఫైనరీ నుండి స్వర్ణనియంత్రణ అధికారులు నేడు కిలో బంగారం స్వాధీనం చేసుకున్నారు

రిఫైనరీ యజమాని పాండురంగదాగి దేవ్‌కార్‌ను అరెస్టు చేసి రు 15 వేల బెయిల్‌పై విడుదలచేశారు

రు 30 లక్షల వజ్రాలు

దక్షిణబొంబాయిలోని ఒక వజ్రాల డీలరు నివాసగృహం ఆఫీసుమీద ఆదాయపు పన్ను అధికారులు నేడు దాడిచేసి రు 30 లక్షల విలువగల వజ్రాలు స్వాధీనం చేసుకున్నారు

ఆర్.టి.సి. బస్సు ప్రమాదం
ఒకరు మృతి

ఖమ్మం అక్టోబరు 28

ఖమ్మం సమీపంలో నిన్న సంభవించిన ఒక ఆర్ టి సి బస్సు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు మరో 20 మంది గాయపడ్డారు

ఆ బస్సు హన్మకొండ వెళ్తున్నది గాయపడినవారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి తక్షణం రు 500 మంజూరు చేశారు

హెల్మట్‌ష్మిడ్ సోవియట్ పర్యటన

మాస్కో అక్టోబరు 28

పశ్చిమజర్మనీ ప్రధాని హెల్మట్‌ష్మిడ్ తన విదేశాంగమంత్రితో అధికారపర్యటనకై నేడు యిక్కడికి వచ్చారు

ఆయనకు విమానాశ్రయంలో సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి లియోనిద్ బ్రెజ్నేవ్ ప్రధాని కొసిగిన్ యింకా యితర సోవియట్ నాయకులు స్వాగతం చెప్పారు

విజయవాడ పట్టణ హోమియో కల్చరల్ సొసైటీ వార్షికోత్సవం

విజయవాడ అక్టోబరు 28

స్థానిక బాల భారతిలో విజయవాడపట్టణ హోమియో కల్చరల్ సొసైటీ ఐదవ వార్షికోత్సవ సభ ఈనెల 20వ తేదీన జరిగింది

సభకు డాక్టర్ బి నారాయణమూర్తి అధ్యక్షత వహించారు గుడివాడ ప్రభుత్వ హోమియో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం కుటుంబరావు ప్రారంభోపన్యాసం చేశారు

ఈ సందర్భంగానే మెటీరియా మెడికా అధ్యాపకులు డాక్టర్ జి వీరభద్రాచారి షష్టిపూర్తి ఉత్సవం కూడా జరిగింది పలువురు ఆయనను నూతన వస్త్రాలతోను యితర కానుకలతోను సత్కరించారు

తర్వాత డాక్టర్స్ కుటుంబరావు ఎం వి యర్ నారాయణరావు కె యస్ ఆర్ శర్మ,వి చంద్రశేఖరరావు ఎం సత్యనారాయణ సుప్రసిద్ధ హోమియో గ్రంథ రచయిత ప్రచురణకర్త శ్రీ వేమవరపు వెంకట రమణశర్మ ప్రముఖ రంగస్థల నటుడు శ్రీ గుడిపాటిసాంబయ్య ప్రభృతులకు సన్మానం జరిగింది కల్చరల్ సొసైటీ కన్వీనరు డాక్టరు ప్రకాశరావు సభికులకు అతిథులను పరిచయం చేశారు గుడివాడ హోమియో కళాశాల ఉపాధ్యాయులు డాక్టర్స్ కుటుంబరావు జి లక్ష్మణరావు సీతారామదాసు ప్రభృతులు హోమియో వైద్య విశిష్టతను గురించి వివరించారు

సభకు సుమారు 200 మంది డాక్టర్లు, విద్యార్థులు పట్టణ ప్రజలు హాజరయ్యారు

కొత్తగూడెం సబ్ ఇన్‌స్పెక్టర్ అక్రమ చర్యలు

కొత్తగూడెం అక్టోబర్ 28

సింగరేణి వర్కర్సు యూనియన్ కార్యకర్త (డ్రయివరు) మహమ్మద్ రంజాన్‌ను యీ నెల 23 వ తేదీన 3 వ టౌన్ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు శ్రీ వెంకటరెడ్డి అనవసరంగా కొట్టారు

ఇంతకుముందు ఈ సబ్ ఇనస్పెక్టరు పట్టణ విద్యార్థి సమాఖ్య కార్యదర్శినికూడా కొట్టడం జరిగింది

3 వ టౌన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ కొనసాగిస్తున్న అక్రమ చర్యలను సింగరేణి కాలరీస్ వర్కర్సు యూనియన్ పట్టణ యువజన సమాఖ్యలు తీవ్రంగా ఖండిస్తూ ఈ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశాయి

అసిఫాబాద్ నీటి సరఫరా పథకం
శ్రీ నరసయ్య విజ్ఞప్తి

అసిఫాబాద్ అక్టోబర్ 27

అసిఫాబాద్‌లో 1971 జులైలో ప్రారంభించబడిన నీటి సరఫరా పథకం తరచుగా చెడిపోతూవున్నది ఈ విషయాన్ని అధికారుల దృష్టికితెస్తే తాత్కాలిక మరమ్మతు మాత్రమే చేస్తున్నారు

వెనుకబడిన ప్రాంతమయిన అసిఫాబాద్‌లో ఏర్పాటు చేయబడిన ఈ పథకానికి అధికారులు అనధికారులు అధిక ప్రాముఖ్యత నిచ్చి నీటి సరఫరాకు తిరిగి అటంకం కలుగకుండా శాశ్వత మరమ్మతు చేయటానికి తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా ఆదిలాబాద్ జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ పి నర్సయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

ఈ నెల 8 వ తేదీనుంచి నీటి సరఫరా నిలిచిపోయింది ఈ విషయంలో అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు

యునాని, ఆయుర్వేద చికిత్సపద్ధతులు
కరణ్‌సింగ్ సూచన

హైదరాబాద్, అక్టోబరు 28

యునాని ఆయుర్వేదం వంటి దేశవాళీ చికిత్సా పద్ధతులు అభివృద్ధిచెందాలంటే గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళి ప్రజలకు ఈ చికిత్స చేసే డాక్టర్లు సన్నద్ధులు కావాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కరణ్‌సింగ్ నేడిక్కడ అన్నారు

ఇక్కడి కేంద్ర యునాని పరిశోధనా కేంద్రంలో జరిగిన సభలో ప్రసంగిస్తూ ఆయన పై విధంగా అన్నారు దేశవాళీ చికిత్సా పద్ధతులపై పరిశోధనలు జరిపేందుకు ఐదవ ప్రణాళికలో ప్రభుత్వం రు. 50 లక్షలు కేటాయించిందన్నారు

యునాని డాక్టర్లు గ్రామీణ ప్రాంతాలలో స్థిరపడి యీ పద్ధతులకు గల ఉన్నత ప్రమాణాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ రాజమల్లు కోరారు

పెద్ద మొత్తంలో ఆహారధాన్యాల పట్టివేత

పాట్నా అక్టోబరు 28

గత మూడు రోజులుగా బీహార్‌లో జరుగుతున్న అక్రమ నిల్వల వెలికితీత కార్యక్రమంలో అనేక లక్షల రూపాయల విలువగల ఆహార ధాన్యాలు సిమెంట్ ఇతర వస్తువులు పట్టివేయబడ్డాయి

నలంద జిల్లాలో 300 బస్తాల ఆహార ధాన్యాలు గయ జిల్లాలో 1900 బస్తాలు శివాన్‌లో 1030 బస్తాలు పశ్చిమ చంపారన్ జిల్లాలో 300 బస్తాల ఆహార ధాన్యాలు పట్టివేయబడ్డాయి.

ఆర్థిక రంగంలో ప్రభుత్వ తిరోగమనాన్ని ప్రతిఘటించాలి
కృష్ణాజిల్లాకమ్యూనిస్టుపార్టీమహాసభముగింపు సందర్భంలో శ్రీ తమ్మారెడ్డి పిలుపు

బందరు అక్టోబరు 28

కృష్ణాజిల్లా 11 వ కమ్యూనిస్టు మహాసభ సందర్భంగా శ్రీ మెట్ల వీరయ్య అధ్యక్షతను బందరు కౌనెళ్ళఫేట్ ఆవరణలో యీనెల 27 న జరిగిన బహిరంగ సభకు తాలూకా నలుమూలల నుండి పట్టణం నుండి 5000 మంది ప్రజలు హాజరైనారు

ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి పెట్టుబడిదారీ ప్రపంచంలో సంక్షోభం ఎలా ముంచుకువస్తోందో సోదాహరణంగా వివరించారు భారతదేశంలో ప్రస్తుత సంక్షోభానికి మూల కారణాలు తెలియజెప్పారు ప్రభుత్వ ఆర్థిక విధానాలు ఎలా తిరోగమనపంథా పట్టినాయో వారు వివరించి, యీ విధానాలను ప్రతిఘటించి ప్రభుత్వాన్ని వామపక్ష దిశకు మళ్ళించడానికి ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యం కావాలని విజ్ఞప్తి చేశారు

శ్రీ దాసరి నాగభూషణరావు దేశంలో ఉవ్వెత్తుగా సాగుతున్న ప్రజా పోరాటాలలో కమ్యూనిస్టుపార్టీ వహిస్తున్న కీలకపాత్రను విశదం చేశారు జిల్లా మహాసభ చేసిన తీర్మానాలు తీసుకున్న నిర్ణయాలు వివరించారు సభానంతరం పోలవరం కవ్వుదొడ్డి మొదలగు గ్రామాలకు చెందిన ప్రజా నాట్యమండలి వారు వైజ్ఞానిక ప్రదర్శనలు యిచ్చారు

బహిరంగసభకు ముందు రెపరెపలాడే అరుణ పతాకాలతో సుమారు 2000 మంది ప్రజలు,జిల్లామహాసభ ప్రతినిధులువూరేగింపు అగ్రభాగాన నడువగా పురవీధులగుండా పెద్ద వూరేగింపు చేశారు వేలాదిమంది ప్రజలు రోడ్ల కిరువైపులా గుమిగూడి యీ ప్రదర్శనను తిలకించారు ఇటీవల కాలంలో యింత పెద్దవూరేగింపు బందరులో జరగలేదని ప్రజలు సంభ్రమాశ్చర్యాలతో చెప్పుకుంటున్నారు

మహాసభ విశేషాలు

కృష్ణాజిల్లా 11 వ కమ్యూనిస్టుపార్టీమహాసభ బందరులో అక్టోబరు 25 26, 27 తేదీలలో జయప్రదంగాజరిగింది. జిల్లాలోని అన్ని తాలూకా, పట్టణ ప్రాంతాలనుండి 270 మంది ప్రతినిధులు, 15 మంది సౌహార్ద ప్రతినిధులు, 69 మంది పరిశీలకులు హాజరయినారు

సభాప్రారంభానికి ముందు ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ దాసరి నాగభూషణరావు ఎర్రజెండా ఎగురవేశారు సభా ప్రాంగణంలో నెలకొల్పిన మృతవీరుల స్థూపంవద్ద ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ తొలుత పుష్పగుచ్ఛముంచారు ఆ వెనుక ప్రతినిధులంతా స్థూపంపై పుష్పాలు వుంచి, శ్రద్ధాంజలి ఘటించారు

గత మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఎన్నుకొబడి 1973 సెప్టెంబరు 9న భూస్వాముల కిరాయి గూండాలచే హత్య చేయబడిన అమరజీవి మాలెంపాటి బాలభాస్కరరావు పేర మహాసభ స్థలానికి "భాస్కర్ నగర్" అని నామకరణం చేశారు

మహాసభ జరిగే బృందావన వర్తక సంఘం హాలు కన్నుల పండువుగా అలంకరించబడింది. మహాసభ నిర్వహణకు శ్రీయుతులు తలసాని జగన్నాధరావు, అల్లి యేసోబు తలసాని రత్నకుమారి పాశం లక్ష్మణస్వామి దోనేపూడి దత్తు గార్లతో అధ్యక్షవర్గం ఎన్నుకొబడింది

శ్రీయుతులు అంజనేయశాస్త్రి మైనేని లక్ష్మణస్వామి అట్లూరి సీతారామయ్య ఉప్పలపాటి రామచంద్రరాజు, మోదుమూడి శ్రీహరిరావు గార్లతో సారథ్య సంఘం నియమించబడింది

అర్హతల సంఘానికి శ్రీయుతులుకొటారు నరసింహారావు, యస్ నాగేశ్వరరావు, కె నరసింహారావులు ఎన్నుకొబడ్డారు

ఆహ్వాన సంఘ అధ్యక్షులు శ్రీ మెట్ల వీరయ్య ప్రతినిధులకు, సౌహార్ద ప్రతినిధులకు, పరిశీలకులకు స్వాగతం చెప్పారు

గత మహాసభానంతరం మరణించిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మన జిల్లా పుత్రులు నిర్మాతలు అమరవీరులు చండ్ర రామలింగయ్య మాలెంపాటి బాలభాస్కరరావు, తలసాని వెంకటరత్నం బూరాడ సీతారామయ్యగార్లకు, ఇటీవల మరణించిన యువ కవయిత్రి విజయలక్ష్మికి, మాజీ రక్షణమంత్రి వి కె కృష్ణమీనన్‌కు మహాసభ జోహార్లు అర్పించింది

భారత కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షులు శ్రీ డాంగేకు ఆర్డర్ ఆఫ్ లెనిన్ దిమిత్రావ్ అవార్డులు లభించడం, ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావుకు ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డు లభించడం పట్ల మహాసభ తన హర్షామోదాలు ప్రకటించింది ఉభయ నాయకులు భారత విప్లవోద్యమ రథసారధులుగాచిరంజీవులుగా జీవించాలనే కాంక్షను ప్రకటించింది. ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి అంతర్జాతీయ జాతీయ పరిస్థితులపై 3 గంటలు రాజకీయ రిపోర్టు యిచ్చారు

జిల్లా కమ్యూనిస్టు సమితి తరఫున జిల్లా రాజకీయ, నిర్మాణ నివేదికను శ్రీ అంజనేయశాస్త్రి ప్రవేశపెట్టారు నివేదికపైన 8 గంటలపాటు జరిగిన చర్చలో మొత్తం 44 మంది ప్రతినిధులు పాల్గొని అనేకమైన నిర్మాణాత్మక సూచనలు చేశారు ఆ సూచనలను పొందుపరచిన రాజకీయ నిర్మాణ నివేదిక ఏకగ్రీవంగా ఆమోదించబడింది

మహాసభ 73 మందితో నూతన జిల్లా సమితి ఏకగ్రీవంగా ఎన్నుకొబడింది. విశాఖపట్టణంలో నవంబరు 27 నుండి జరిగే ప్రదేశ్ మహాసభకు జిల్లాలోని 6211 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 88 మంది ప్రతినిధులను 17మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులను కూడా ఎన్నుకోవడం జరిగింది

మహాసభ నిర్ణయాలను సింహావలోకనం చేస్తూ జిల్లాలో మనపార్టీ నిర్వహించవలసిన రాజకీయ నిర్మాణ కర్తవ్యాలను పేర్కొంటూ ప్రదేశ్ సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ దాసరి ఉత్తేజకరమైన ముగింపు వుపన్యాసం యిచ్చారు

నూతన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు

నూతన జిల్లాసమితి తరువాత సమావేశమై 17 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకొన్నది జిల్లా సమితి కార్యదర్శిగా శ్రీ జి యస్ ఆర్ అంజనేయశాస్త్రి సహాయ కార్యదర్శులుగా శ్రీయుతులు యం శ్రీహరిరావు కొల్లి నాగేశ్వరరావులు ఎన్నుకొబడినారు కార్యవర్గానికి 14మందిఎన్నికయ్యారు

తీర్మానాలు

1 భూసంస్కరణలు సక్రమంగా అమలు జరపడానికి ప్రజా కమిటీలు నియమించాలనీ (2) విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం వెంటనే జరగాలనీ (3) విజయవాడలో మోటారు స్పేర్‌పార్ట్సు యంత్రాగారం నెలకొల్పాలనీ (4) బందరు రేవును అభివృద్ధి చేయాలనీ (5) రైతాంగానికి ఎరువులు కంట్రోల్ రేటుకు సప్లయి చేయాలనీ మొదలైన తీర్మానాలు మహాసభ ఆమోదించింది

ఆహ్వాన సంఘంవారు మహాసభకు చాల చక్కని యేర్పాటు చేశారు బందరు పట్టణ, తాలూకా ప్రజలు విరివిగా విరాళాలు యిచ్చి తోడ్పడ్డారు బందరులో జిల్లా మహాసభ జరగడం యిదే మొదటిసారి అయినా చాల సమర్థవంతంగా నిర్వహించబడింది మహాసభ నిర్వహణకు తోడ్పడినవారందరికి జిల్లా కమ్యూనిస్టు సమితి తరఫున కృతజ్ఞత తెలియజేయబడింది

పిఠాపురం తాలూకామహాసభ

గ్రామ గ్రామాన చౌకడిపోలు తెరవాలనీ నిత్యజీవావసర వస్తువులు డిపోల ద్వారా పేద ప్రజలకు అందించాలనీ బంజరుసాగుదార్లకు పట్టాలివ్వాలనీ, అన్ని గ్రామాలలోనూ యున్న పేదలకు యిండ్ల స్థలాలు కేటాయించాలనీ, 5 ఎకరములలోపు రైతులకు ధాన్యం లెవీనుండి మినహాయించి 10 ఎకరాలు 15 యకరాలు గ్రేడెడ్‌గా లెవీ విధించాలని పిఠాపురం తాలూకా కమ్యూనిస్టుపార్టీ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది

ఈ మహాసభ ఈనెల 24 25 తేదీలలో కొత్తపల్లిలో అత్యంత ఉత్సాహవాతావరణంలో జరిగింది సభకు 90 మంది ప్రతినిధులు 15 మంది సౌహార్ద ప్రతినిధులు హాజరైనారు శ్రీ రావు అగ్గిరాజు జండా ప్రతిష్ఠ చేశారు మహాసభకు శ్రీ కాకి తిరుపతిరావు అధ్యక్షత వహించారు

తూర్పు గోదావరిజిల్లా కమ్యూనిస్టుపార్టీ సహాయ కార్యదర్శి అల్లూరి వెంకట్రామరాజు సభను ప్రారంభిస్తూ జాతీయ అంతర్జాతీయ రాజకీయ పరిణామాల గురించి వివరించారు

2వన తాలూకాకమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ మొగిలి సూర్యారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా అనంతరం కార్యదర్శి నివేదిక ఆమోదించబడినది.

ప్రారంభంలో మద్దుకూరి చంద్రశేఖర రావు చిట్టాల చిన్న విజయలక్ష్మి,వి కె కృష్ణమీనన్ ప్రభృతుల మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ తీర్మానం చెయ్యబడింది

భారతకమ్యూనిస్టుపార్టీ చైర్మన్ శ్రీఎస్ ఏ డాంగే ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావులకు ఆర్డరు ఆఫ్ లెనిన్ అవార్డు లభించినందుకు వారిని అభినందిస్తూ సభ తీర్మానించింది

పిఠాపురం తాలూకా కార్యదర్శిగా శ్రీ మొగిలి సూర్యారావు, సహాయ కార్యదర్శిగా శ్రీ కాకి తిరుపతిరావు 5 గురుతోకార్యవర్గాన్ని 25గురుతోసమితిని ఎన్నుకున్నారు

నెల్లూరుతాలూకా పార్టీ మహాసభ

నెల్లూరు తాలూకా 9 వ కమ్యూనిస్టు పార్టీ మహాసభ నెల్లూరు తిప్పరాజువారి సత్రం కల్యాణ సదనంలో ఈనెల 20 న జరిగింది మహాసభకు అధ్యక్షవర్గంగా శ్రీ గుండాలత్తిన వెంకటసుబ్బయ్య శ్రీ కటికాల శేషయ్య ఎన్నుకొబడినారు

మద్దుకూరి చంద్రం జిల్లా పార్టీ కార్యకర్తలు మాల కొండయ్య సాదేపల్లి వేమయ్య షేక్ మస్తాన్ కృష్ణమీనన్‌గార్ల మృతికి మహాసభ సంతాపం ప్రకటించింది

తరువాత జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పి రామకోటయ్య అంతర్జాతీయ పరిస్థితులపైనా, జాతీయ రాజకీయ పరిస్థితుల పైనా జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీ జి ఎ. పద్మనాభయ్య పార్టీ నిర్మాణంపైన రిపోర్టు యిచ్చారు

తర్వాత తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ పి దశరథరామయ్య తాలూకా పార్టీ నిర్మాణ, రాజకీయ పరిస్థితులపైన, ప్రజా సంఘాల రిపోర్టులను ప్రవేశపెట్టారు

నూతన సమితికి 29మందిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు కార్యవర్గాన్ని 7 గురితోను, కార్యదర్శిగా శ్రీ సముజాలదశరథరామయ్యను ఎన్నుకొన్నారు సహాయ కార్యదర్శిని మరో సమితి సమావేశంలో ఎన్నుకొనుటకు తీర్మానించబడింది.

ప్రతి గ్రామాన చౌకడిపో పెట్టాలనీ రు 18 30 కిలోల బియ్యం ఇవ్వాలనీ ప్రతి గ్రామానికి డీలరును నియమించి చౌక గుడ్డ సప్లయి చెయ్యాలనీ తాలూకాలో బంజరు భూములుఎంపకానికి ప్రస్తుతం నియమించిన సిబ్బంది చాలదనీ, సోమశిల ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలనీ ప్రతి గ్రామాన చౌక డిపోలు ఏర్పాటుచేయాలని, ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలనీ కనుపూరు కాల్వ పనిని పూర్తి చేయాలని తదితర తీర్మానాలు ఆమోదింపబడ్డాయి.

శ్రీయుతులు డాంగే రాజేశ్వరరావులకు ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డు లభించినందుకు మహాసభ వారినిఅభినందించింది మహాసభకు 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

అబ్దుల్ అలీమ్ నిరాహారదీక్ష 5 వ రోజుకు చేరిక

మచిలీపట్నం అక్టోబరు 28

మచిలీపట్నంలో ఆర్ టి సి డ్రైవర్ శ్రీ అబ్దుల్ అలీమ్ ప్రారంభించిన నిరవధిక నిరాహారదీక్ష నేటికి 5 వ రోజుకు ప్రవేశించింది పరిస్థితి తీవ్రంగా వుంది

ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవలసిందిగా కోరుతూ డివిజనల్ మేనేజర్‌కు టెలిగ్రామ్‌లు పంపారు.

ఉద్యోగులసమస్యలను తక్షణమే పరిష్కరించవలసిందిగా తాలూకా కమ్యూనిస్టుసమితి ఒక ప్రకటనలో కోరింది.

వచ్చే ఐదేళ్లలో 150లక్షల టన్నుల నూనె ఉత్పత్తి
హిందుస్తాన్ పెట్రోలియం ప్రొడక్ట్సు చైర్మన్ వెల్లడి

హైదరాబాదు, అక్టోబరు 28

భారత్ నూనె ఉత్పత్తి శక్తిని వచ్చే ఐదు సంవత్సరాల్లో 70 లక్షలటన్నులనుండి 150 లక్షల టన్నులకు పెంచాలని నిర్ణయించినట్లు అందుకు రు 600 కోట్లు ఖర్చుకాగలదనీ హిందూస్థాన్ పెట్రోలియం ప్రొడక్టు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు శ్రీ యన్ కృష్ణమూర్తి నేడిక్కడ చెప్పారు

సముద్రతీరంపైన సముద్రతీరంలోను పెద్దయెత్తున నూనెపరిశోధనలు కొనసాగింపబడుతున్నాయనీ కొన్ని విదేశీ కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించడం జరిగిందనీ ఆయన ఆంధ్రవాణిజ్య మండలిలో ప్రసంగిస్తూ చెప్పారు

ప్రపంచ మార్కెట్‌లో నూనె ధరలు స్థిరంగా వుంటాయనీ బారెల్ ధర 11 డాలర్ల నుండి 10 డాలర్లకు తగ్గవచ్చుననీ ఆయన చెప్పారు

నూనె ఉత్పత్తిచేసే దేశాలకు నూనెపై వచ్చే ఆదాయం యీ సంవత్సరంలో 14 500 కోట్ల నుండి 90,000 కోట్ల డాలర్లకు పెరిగిందనీ వచ్చే సంవత్సరం యీ ఆదాయం 110 000 కోట్ల డాలర్లకు పెరుగుతుందనీ ఆయన చెప్పారు భారత దేశం దిగుమతిచేసుకొనే క్రూడాయిల్ బిల్లు 1970 లో రు 160 కోట్లనుండి యీ సంవత్సరం రు 980 కోట్లకు,వచ్చే సంవత్సరం రు 1 200 కోట్లకు పెరుగుతుందనిచెప్పారు

పై పరిస్థితులదృష్ట్యా భారతదేశం పెట్రోలియం క్రూడాయిలు ఉత్పత్తి బిల్లులను తగ్గించుకోవాలనీ, అందుకుగాను నూనె పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత యివ్వవలసివుందనీ ఆయన చెప్పారు

అక్రమంగా విద్యుత్ వినియోగం

హైదరాబాద్ అక్టోబరు 28

వరంగల్‌జిల్లా మేడికొండ రాంపూర్ గ్రామాలలో విద్యుత్ దొంగతనానికి సంబంధించిన రెండు కేసులను రాష్ట్ర విద్యుత్ బోర్డు నిఘావిభాగానికి చెందిన ఇంజనీర్లు పట్టివేశారు

ఇందుకు పాల్పడిన ఇద్దరు వ్యవసాయ వినిమయదారులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు నేడిక్కడ ఒక ప్రకటనలో తెలియచేయబడింది

తూర్పుగోదావరిజిల్లా మండపేటలో ఒక రైసుమిల్లులో మీటరులో నమోదుకాని పద్ధతిలో విద్యుత్‌ను వినియోగిస్తుండగా పట్టివేయటం జరిగింది

ఈ మిల్లు విద్యుత్ కనెక్షన్‌ను తీసివేసి అక్రమపద్ధతుల్లోవిద్యుత్‌ను వాడుకున్నందుకు రు 47 800 చెల్లించాల్సిందిగా ఉత్తరువు లివ్వటం జరిగింది

గుజరాత్‌లో నూనె టెర్మినల్
శ్రీ శరీన్ వెల్లడి

జామ్‌నగర్ అక్టోబరు 28

బరోడాలోని గుజరాత్ నూనెశుద్ధి కర్మాగారానికి ఉత్తరప్రదేశ్‌లో మధుర నూనె శుద్ధి కర్మాగారానికి క్రూడాయిల్ సరఫరా చేసేందుకై జామ్‌నగర్‌జిల్లాలోని సలయా రేవువద్ద దిగుమతిచేసుకున్న క్రూడాయిల్‌కు రెండుపైప్ లైన్లతో ఒక నూనె టెర్మినల్ రు 120 కోట్లవ్యయంతో నెలకొల్పబడనున్నట్లు అధికార వర్గాలద్వారా తెలియవస్తోంది

సముద్రంలోనిలుపు చేయబడిన నౌకల నుండి క్రూడాయిల్ సేకరించేందుకు ఆరు మీటర్ల పొడవున సముద్రం క్రిందుగా పైప్‌లైను నిర్మించాలని ఆ ప్రాజెక్టులో నిర్ణయించబడింది

దిగుమతి చేసుకున్న క్రూడాయిల్, బరోడాకు వేసే 410 కిలోమీటర్ల పైప్‌లైన్ గుండాను వీరాంగంమీదుగా మధురకు వేయబడే 1270 కిలో మీటర్ల పైప్‌లైన్‌గుండాను సరఫరా చెయ్యబడుతుంది

గుజరాత్ నూనె శుద్ధి కర్మాగారం పైప్‌లైన్‌ను ఉపయోగించే తొలి కర్మాగారమనీ దీనివల్ల కర్మాగారం నూనె శుద్ధిచేసే శక్తి 65 లక్షల టన్నులకు పెరుగుతుందనీ గుజరాత్‌గవర్నరు సలహాదారు శ్రీహెచ్ సి శరీన్ వివిధ అధికారులతో మాట్లాడుతూ చెప్పారు

తంతి తపాల ఉద్యోగుల సంఘం క్లాస్ III వార్షిక సమావేశం

హైదరాబాద్ అక్టోబరు 29

అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం క్లాసు - 3 ఆంధ్ర సర్కిల్ 14 వ వార్షికోత్సవం హైదరాబాదులో అక్టోబరు 27 28 29 తారీఖులలో శ్రీ యం వి యస్ పి టి శర్మ అధ్యక్షతన జరిగినది వచ్చే సంవత్సరానికి యీ క్రింది కార్యవర్గ ముసు ఏకగ్రీవముగా ఎన్నుకోవటమయినది

అధ్యక్షులుగా శ్రీ యం మానిరెడ్డి ఉపాధ్యక్షులుగా వి వి యర్ నారాయణ జి ఆర్ కె రెడ్డి కార్యదర్శిగా పి రామమూర్తి సహాయ కార్యదర్శులుగా సోమమంతరెడ్డి యం వి యస్ పి టి శర్మ కోశాధికారిగా యన్ రాజయ్య, సహాయ కోశాధికారిగా శ్రీ కె శంకరయ్య నిర్మాణ కార్యదర్శులుగా బి హెచ్ బాలకృష్ణారావు త్రివేది మహమ్మద్ వాజిసిరాన్ ఎన్నికయ్యారు

క్లాస్ IV ఉద్యోగుల సంఘం

అఖిలభారత తపాల ఉద్యోగుల సంఘం పోస్టుమెన్ IV తరగతి ఉద్యోగుల ఆంధ్ర సర్కిల్ 14 వ వార్షికోత్సవం 27 28 29 (అక్టోబరు) తారీఖులలో హనుమకొండలో జరిగింది ఈ క్రింది నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొబడినారు

అధ్యక్షులు : శ్రీ కె యల్ మహేంద్ర (యం యల్ సి) ఉపాధ్యక్షులుగా జి ఈశ్వరయ్య బి వి శేషయ్య కార్యదర్శిగా శ్రీ హనుమంతరెడ్డి డిప్యూటీ కార్యదర్శి డి ధన్‌సింగ్ సహాయ కార్యదర్శులుగా ఆర్ యల్ నారాయణ డి కె మూర్తి కోశాధికారిగా డి పెద్దయ్య, నిర్మాణ కార్యదర్శులుగా డి వి ప్రసాదరావు డి జగన్నాధంలు ఎన్నికయ్యారు.

జిల్లా వాలీబాల్ అసోసియేషన్

విజయవాడ అక్టోబరు 28

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ వార్షిక సమావేశం యీనెల 17 న స్థానిక మున్సిపల్ స్టేడియంలో జరిగింది

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ వి ప్రభాకరరావు సమావేశానికి అధ్యక్షత వహించారు 1974 75 సంవత్సర ఆఫీసు బేరర్లను సమావేశం ఎన్నుకున్నది శ బి గోపాలకృష్ణ అధ్యక్షులుగా శ్రీ జి జె బాబు కార్యదర్శిగా శ్రీ యన్ సత్యనారాయణ కోశాధికారిగా ఎన్నికయ్యారు

కర్ణాటక రాష్ట్రంలో శ్రీ వావిలాల పర్యటన

హైదరాబాద్ అక్టోబరు 27

కన్నడను అధికార భాషగాచేసిన తర్వాత కర్ణాటకలో జరిగిన పురోగతిని పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమిషన్ అధ్యక్షులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ఆ రాష్ట్రంలో ఐదు రోజులపాటు పర్యటించారు

తెలుగు కన్నడభాషలకు రాతలో చాలా పోలికలుంటాయి గనక కన్నడ లినోటైపు మిషన్లను ఆకమిషన్ పరిశీలించింది ఇలాంటి మిషన్లు ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రవేశపెట్టవచ్చు

బెంగుళూరు మైసూరులలోని ప్రభుత్వ ప్రెస్‌ల అధికార్లు డైరెక్టర్లతో శ్రీ వావిలాల చర్చించారు గత ఆరేడు సంవత్సరాల నుండి ఆ ప్రెస్‌లలో కన్నడ లినోటైపులు పనిచేస్తున్నాయి

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమిషన్ కార్యదర్శి శ్రీ పి వి నరసింహారావు, కమిషన్ సభ్యుడు శ్రీ వి పి రాఘవాచారి, ప్రింటింగ్ డైరెక్టర్ శ్రీ వి నారాయణరావులు పర్యటనలో శ్రీ వావిలాల వెంట వున్నారు

సమాచార కార్యాలయ ముఖ్య అధికారిగా ధూళిపూడి అంజనేయులు

హైదరాబాద్ అక్టోబరు 28

ఇటీవలి వరకు న్యూఢిల్లీలో ప్రచురణల విభాగం సంపాదకులుగా పనిచేసిన శ్రీ ధూళిపూడి అంజనేయులు ఈనెల 19 వ తేదీన ఇక్కడిపత్రికాసమాచారకార్యాలయంముఖ్య అధికారిగా పదవీ స్వీకారం చేశారు ఇంతకు ముందు వరకు ఈపదవిలో వున్న శ్రీ శ్రీపాద వెంకటరత్నం సికిందరాబాదులోని రక్షణశాఖ తాలూకు ప్రజా వ్యవహారాల డైరెక్టర్ కార్యాలయంలో ప్రజా వ్యవహారాల అధికారిగా బదిలీ అయ్యారు

వరంగల్ జిల్లా అరసం ఏర్పాటు

వరంగల్ అక్టోబరు 28

ఈ నెల 20 వ తేదీన వరంగల్ జిల్లా అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా చెన్నూరావుపేటలో సమావేశం జరిగింది

సమావేశంలో శ్రీ పల్లేరు వీరాస్వామి కన్వీనరుగా మరో ఏడుగురితో ఆర్గనైజింగ్ కమిటీని ఎన్నుకున్నారు శ్రీయుతులు జి యాదగిరి గందం ఎల్లేశ్వర్ జేమ్సు, వి హెచ్ అప్పన్న టి శ్రీనివాసరెడ్డి, వి హెచ్ రవీందర్ బి కరుణాకర్, పి. మల్లయ్యలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు

ప్రదేశ్ సంఘంనుంచి సభ్యత్వ పుస్తకాలు తెప్పించి సభ్యులను చేర్చుకోవాలని, సాధ్యమైనంత త్వరలో జిల్లా అరసం మహాసభను ఏర్పాటుచేయాలని తీర్మానించారు.

శ్రీమతిగాంధీ, చావన్‌తో కిసింగర్ చర్చలు

న్యూఢిల్లీ అక్టోబరు 28

భారతదేశంలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగమంత్రి డాక్టర్ హెన్రీ కిసింగర్ నేడిక్కడ విదేశాంగమంత్రి శ్రీ వై. బి. చావన్ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీలతో విడివిడిగా రెండుదఫాలు చర్చలు జరిపారు

గతంలో దురభిప్రాయాలను తొలగించుకోవటంలో విజయవంతుల మయ్యామని చర్చల వివరాలను పత్రికా విలేకరులకు వివరిస్తూ డాక్టర్ కిసింగర్ ప్రతినిధిఅన్నారు

రెండు దేశాలమధ్య సంబంధాలకు సంబంధించి భవిష్యత్తులో అమెరికా పై అది చాల సానుకూలంగా వుంటుందన్నారు

రెండుదేశాల సంబంధాలను దక్షిణాసియాతోపాటు అంతర్జాతీయ సమస్యలపైనా సోవియట్ యూనియన్ చైనాలపట్ల తమ దేశాలవైఖరులపైనా కిసింగర్ - చావన్‌ల మధ్య ఉదయం రెండుగంటలపాటు చర్చలు జరిగాయి

ఆ తర్వాత మధ్యాహ్నం జాయింట్ కమిషన్ ఒప్పందంపై సంతకాలుచేసి వీరిద్దరు కొద్దిసేపు చర్చలుజరిపారు

శ్రీమతి గాంధీతో ఉదయం గంటపాటు రెండుదేశాలమధ్య సంబంధాలను సమీక్షించిన డాక్టర్ కిసింగర్ సాయంత్రం మరోసారి శ్రీమతి గాంధీతో చర్చలు జరిపారు

అంతర్జాతీయ పరిస్థితిని సమీక్షించటంతో పాటు ద్వైపక్షంగాను అంతర్జాతీయంగాను మరింత ఎక్కువగా సహకరించుకోవటంలో రెండుదేశాల ప్రయోజనాలు విరుద్ధంగా లేవని కనుగొనటం జరిగిందని భారతీయ ప్రతినిధి విలేకరులకు తెలియచేశారు

జాయింట్ కమిషన్‌పై సంతకాలు జరిగిన వెంటనే లాంఛన ప్రాయంగా కమిషన్ మొదటి సమావేశం జరిగింది కమిషన్ మూడు ఉప సంఘాలలోవుండే ప్రతినిధుల పేర్లను అమెరికా ప్రకటించింది. భారతదేశం తన ప్రతినిధులను త్వరలో ప్రకటిస్తుంది

మంచి అవగాహనను ఏర్పాటు చేసుకోవటంలో భారతీయ నాయకులతో కిసింగర్ జరిపిన చర్చలు దోహదం చేశాయని చెప్పేందుకు తనకు అధికార మివ్వబడిందని యీ ప్రతినిధి అన్నారు.

రెండు పక్షాలు నిన్న బహిరంగంగా చేసిన ప్రకటనల స్వభావరూపంలోనే దాదాపు చర్చలున్నాయని విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ అమెరికా ప్రతినిధి అన్నారు. జాయింట్ కమిషన్ పరిధిలోనే రెండుదేశాల సంబంధాల మధ్య అభివృద్ధికి అవకాశమున్నదని అమెరికా భావిస్తున్నదన్నారు

అణు పరీక్ష

భారత్ అణుపరీక్షపై కూడా చర్చలు జరిగాయా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ అనేక అంశాలపై చర్చలు జరిగాయని అణుపరీక్ష సమస్యను సవివరంగా పరిశీలించలేదని తెలిపారు భారత్ అణు విధాన లక్ష్యం ఉదయం చర్చలలో ప్రస్తావనకు రాలేదు చర్చకురాని అంశంపై వ్యాఖ్యానించటం మంచిదికాదని అమెరికా ప్రతినిధి అన్నారు.

దక్షిణాసియాలోకి అమెరికా ఆయుధాల తరలింపుపై చర్చించటం జరిగిందా ? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ యీసమస్య రెండు పక్షాలకు ఆసక్తికరమైన అంశమని ప్రాంతీయ ఉపప్రాంతీయ సమస్యల అంశంలో భాగంగా దీనిపై చర్చించటం జరిగిందని తెలిపారు

ఉపఖండంలో ఆయుధ పోటీలో ఆసక్తి లేదనే అమెరికా విధాన ప్రకటనను ప్రతినిధి ఉటంకించారు

భారత్‌కు ఆహార సరఫరా పై నిర్దిష్టంగా చర్చ జరగలేదని, అయితే రెండు పక్షాలు ప్రపంచ ఆహార సమస్యపై చర్చించా యన్నారు

డిగోగార్షియా

డిగోగార్షియా సమస్యపై భారతీయ ప్రజల పార్లమెంట్ ఆందోళనను చర్చల సందర్భంగా భారత పక్షం ప్రస్తావించిందని భారతీయ ప్రతినిధి చెప్పారు

భారత విదేశాంగమంత్రి చెప్పిన భారత్ అభిప్రాయాన్ని జాగ్రత్తగా హెన్రీ కిసింగర్ విన్నారని అమెరికా ప్రతినిధి అన్నారు

మొత్తం చర్చలలో రెండు దేశాల సంబంధాలకు దురభిప్రాయాలు యిబ్బందులు కలుగకుండా చూడటంపై ప్రత్యేక ప్రాధాన్యత యివ్వడం జరిగిందని రెండుదేశాల ప్రతినిధులు అన్నారు

అమెరికా నూనె ధరల విధానం యీరోజు చర్చలలో రాలేదని, అయితే రేపు కిసింగర్ వివిధ మంత్రులతో జరిపే చర్చలలో ప్రస్తావనకువచ్చే అవకాశాన్ని నిరాకరించలేమని వారు తెలిపారు

భారతదేశంతో సంబంధాలు మెరుగు పరచుకోవాలనే అమెరికా ప్రయత్నంపట్ల సోవియట్ యూనియన్ సుముఖంగాలేదనే అభిప్రాయం అమెరికాకు కలిగిందా అన్న ప్రశ్నకు సమాధానంగా ఆ రూపంలో అమెరికా భావించటంలేదన్నారు

అమెరికా-సోవియట్, భారత్ సోవియట్ సంబంధాలు చర్చకువచ్చాయని సోవియట్ భారత్ సంబంధాలలో అమెరికాకేమి సమస్య లేదని స్పష్టంగా చెప్పటం జరిగిందన్నారు

సిక్కిం సమస్య చర్చించలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా భారత్ ప్రతినిధి అన్నారు మరో ప్రశ్నకు సమాధానమిస్తూ భారత్ చైనా సంబంధాల అభివృద్ధి అమెరికా ప్రయోజనాలకు అభిలషితంగా విరుద్ధంకాదని అమెరికా ప్రతినిధి అన్నారు

భారత్ ఉపఖండంలో మామూలు సంబంధాల ఏర్పాటుకు ప్రతిబంధకం కల్పించేదేది అమెరికా చేయదని హెన్రీకిసింగర్ చర్చల సందర్భంగా హామీయిచ్చినట్లు పి. టి. ఐ. విలేకరి తెలుపుతున్నారు

దక్షిణాసియాలో ప్రధానమైన శక్తిగా భారత్‌ను గుర్తించటంతోపాటు బలాబలాలు సమతూకం చేయటం లేక మరో దేశంతో సమంగా చేసి చూడటంవంటిది జరగదనికూడ కిసింగర్ హామీ నిచ్చారట

శిఖరాగ్ర సమావేశం

ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి అమెరికా అధ్యక్షులు గెరాల్డు ఫోర్డుల మధ్య త్వరలో శిఖరాగ్రసమావేశం జరిగే అవకాశం వున్నదని అమెరికా అధికార్లు సూచన ప్రాయంగా తెలిపారు.

భారత్ అమెరికా సంబంధాల మెరుగును సమీక్షించటంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై చర్చించేందుకు వారిద్దరు సమావేశమయ్యే అవకాశ మున్నదన్నారు.

కర్నాటక కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం

బెంగుళూరు, అక్టోబరు 28

శ్రీ దేవరాజ్ అర్సు నాయకత్వాన వున్న కర్నాటక మంత్రివర్గంలో నేడు మరో ఆరుగురు కొత్తమంత్రులు చేరారు

రాజభవన్‌లో జరిగిన ఒక ఉత్సవంలో యీ ఆరుగురితోపాటు క్యాబినెట్ స్థాయి పొందిన శ్రీమతి [illegible] గవర్నర్ శ్రీ మోహన్‌లాల్ సుఖాడియా ప్రమాణస్వీకారం చేయించారు

శ్రీ వారితోపాటు ప్రమాణస్వీకారంచేసిన వారిలో క్యాబినెట్ మంత్రి శ్రీ మహ్మద్ అలీ, స్టేట్ మంత్రులు శ్రీ యు కె ఆర్ గుండూరావు శ్రీ రాములు వీరప్ప మొయిలీ, సుభాష్ అస్నూరీ, శ్రీమతి మనోరమ మాధవరావ్ వున్నారు

శ్రీ మహ్మద్ అలీ అంగ్లంలో మిగిలిన వారు కన్నడంలో ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ ఆరుగురు కొత్త మంత్రులతో 2½ సంవత్సరాల శ్రీ అర్సు మంత్రివర్గ సంఖ్య 25 కు పెరిగింది 15 మంది క్యాబినెట్ స్థాయి 10 మంది స్టేట్ మంత్రులు

భారత్ - అమెరికా జాయింట్ కమిషన్

ఒప్పందంపై కిసింగర్, చావన్‌ల సంతకాలు

న్యూఢిల్లీ అక్టోబరు 28

భారత అమెరికాల మధ్య వివిధ రంగాలలో సహకారాన్ని విస్తృతం చేసుకునేందుకు వుద్దేశించిన జాయింట్ కమిషన్ ఒప్పందంపై రెండు దేశాల విదేశాంగ మంత్రులు శ్రీ వై. బి. చావన్, డాక్టర్ హెన్రీ కిసింగర్‌లు నేడిక్కడ సంతకాలు చేశారు

ఆర్థిక వాణిజ్య శాస్త్రీయ విజ్ఞానశాస్త్ర విద్య, సాంస్కృతిక వ్యవహారాలలో పరస్పర ప్రయోజనకరమైన సహకార అవకాశాలు పరిశీలించటం యీ కమిషన్ లక్ష్యంగా వుంటుంది.

జాయింట్ కమిషన్‌పై సంతకాల అనంతరం వారిద్దరు మాట్లాడుతూ రెండు దేశాల మధ్య సంబంధాలలో ముఖ్యమైన మైలురాయి అని అన్నారు

కమిషన్ మొదటి సమావేశం వచ్చే సంవత్సరం వాషింగ్టన్‌లో జరగాలని కిసింగర్ సూచించారు చావన్ యీ సూచనను అంగీకరించారు

పటిష్టమైన సహకారం కొరకు అవసరమైన యంత్రాంగాన్ని నిర్మించాలనే రెండు ప్రభుత్వాల ఆకాంక్షకు నిర్దిష్టరూపమే జాయింట్ కమిషన్ అని శ్రీ చావన్ అన్నారు

ఒప్పందం ప్రకారం జాయింట్ కమిషన్‌కు అమెరికా, భారత్ విదేశాంగ మంత్రులు నాయకత్వం వహిస్తారు సంవత్సరానికి కనీసం ఒకసారి సమావేశమవుతారు

రెండు ప్రభుత్వాల ప్రతినిధులతోపాటు అనధికార నిపుణులను సలహాదార్లను కమిషన్‌లో చేర్చుకోవచ్చును నిర్దిష్ట సమస్యలను అంశాలను ఎదుర్కొనేందుకు ఉపసంఘాలను కూడా ఏర్పాటుచేసే అవకాశం వుంటుంది

ఇంధనం, ఎరువులు అభివృద్ధి మొదలైన రంగాలలో భారత్ అమెరికాల మధ్య విస్తృత సహకార అంశాలను కమిషన్ ఉపసంఘం పరిశీలించి నిర్ణయిస్తుంది రెండు దేశాలమధ్య వాణిజ్యాభివృద్ధి భారతదేశంలో పెట్టుబడుల హెచ్చింపు మొదలైన కార్యక్రమాలను కూడా ఉపసంఘం రూపొందిస్తుంది.

భారత్-అమెరికా జాయింట్ కమిషన్

జ్యోతిర్మయిబాసు ఆందోళన

న్యూఢిల్లీ అక్టోబరు 28

ఆర్థిక సహకారం ముసుగులో అమెరికా ప్రైవేట్ సంస్థలతో సంబంధాలను ఏర్పాటుచేసే భారత అమెరికా జాయింట్ కమిషన్ వల్ల దేశ భవిష్యత్తుకు విఘాతం కలుగుతుందని మార్క్సిస్టు నాయకులు శ్రీ జ్యోతిర్మయిబాసు నేడిక్కడ ఆందోళన వెలిబుచ్చారు

ప్రభుత్వాస్పత్రుల్లో స్త్రీల నియామకం

మంత్రి శ్రీ రాజమల్లు వెల్లడి

గుంటూరు అక్టోబరు 28

వైద్య ఆరోగ్య శాఖామంత్రి శ్రీ కె రాజమల్లు నిన్న యిక్కడ పత్రికలవారితో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సేవ చేయడానికి స్త్రీ ఉద్యోగులను యికముందు నియమించనున్నట్లు మేల్ నర్సింగ్ ఆర్డర్లీల రిక్రూట్‌మెంట్ యికముందు ప్రోత్సహించబోవడంలేదని తెలియజేశారు.

ఆసుపత్రులలో సిబ్బంది నిర్వహించే ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాలను ప్రభుత్వం గుర్తించబోదని ట్రేడ్‌యూనియన్లకు సంబంధించిన పారిశ్రామిక వివాదాల చట్టం తదితర చట్టాలు వారికి వర్తించవని శ్రీ రాజమల్లు అన్నారు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేరుకొనిపోయిన అవినీతిని నిర్మూలించడానికి ప్రజల సహకారం వున్నట్లయితే ప్రభుత్వం సఫలమవుతుందని తెలియజేశారు

మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలను గురించి రాజమల్లు వివరిస్తూ అభ్యర్థుల వయోపరిమితి సడలింపు జరుగబోదని షట్సూత్ర పథకం ద్వారా ఆసుపత్రులలో ఖాళీగా వున్న వుద్యోగుల స్థానాలను భర్తీ చేయనున్నట్లు కూడా ఆయన తెలియజేశారు

మీసా క్రింద 400 మంది అరెస్టు

శ్రీనగర్, అక్టోబరు 28

ఆర్థికపరమైన నేరాలు చేసినందుగాను అంతరంగికభద్రతాచట్టంక్రింద 400మందిని అరెస్టుచేసినట్లు కేంద్ర హోంశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఓం మెహతా నేడు చెప్పారు

అక్రమంగా నిల్వచేయటాన్ని బ్లాక్ మార్కెటింగ్, స్మగ్లింగును పూర్తిగా నిర్మూలించేవరకు ప్రభుత్వం విశ్రమించదని ఆయన చెప్పారు

కాశ్మీర్ లోయలోని పలుప్రాంతాలలో జరిగిన బహిరంగసభలలో ప్రసంగిస్తూ ఆయన పై విషయం తెలియచేశారు

మీనంబాకం విమానాశ్రయంలో బంగారు బిస్కట్లు స్వాధీనం

మద్రాసు అక్టోబరు 28

ఇక్కడి మీనంబాకం విమానాశ్రయంలో సింహళంనుంచి వస్తున్న ఒక ప్రయాణీకుని వద్దనుంచి ఒక్కొక్కటి 10తులాలబరువుగల రెండు బంగారు బిస్కట్లను ఒక బంగారు గొలుసు కొంత భారత కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు

వీటి మొత్తం విలువ రు 12 వేలు వుంటుంది

ఈ ప్రయాణీకుని కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు

అహమ్మదాబాద్‌లో బంగారం, వెండి స్వాధీనం

అహమ్మదాబాద్ అక్టోబరు 28

అహమ్మదాబాద్‌లో ఒక వడ్డీ వ్యాపారి యింటినుంచి రు 60 వేల విలువగల బంగారుఆభరణాలను రు 90 వేల విలువగల వెండి ఆభరణాలను స్వాధీన పరచుకున్నట్లు యిక్కడ ఒక అధికార ప్రకటనలో తెలియచేయబడింది

బ్యాంక్ లాకర్‌లో 1½ కిలోల బంగారం

అహమ్మదాబాద్ అక్టోబరు 28

స్థానిక ఆహారధాన్యాల వ్యాపారి బ్యాంకు లాకర్లలో రు 83750 విలువగల 1 53 కిలోల బంగారాన్ని నేడు ఆదాయపుపన్ను శాఖ అధికారులు కనుగొన్నారు

గత శనివారం ఈ వ్యాపారి ఇల్లు, గోడౌన్‌లపై దాడిచేసి ఇతని బ్యాంకు లాకర్లను అధికార్లు సీలు చేశారు దీనితో ఇతనివద్ద పట్టుబడిన బంగారం, ఆభరణాల విలువ రు 2 28 లక్షలకు పెరిగింది ఇతనివద్ద రు. 14 వేల గుప్తధనాన్ని కూడా స్వాధీనపరచుకున్నారు

ఇతని గోడౌన్‌ల నుంచి రు 35 వేల విలువగల ఆహారధాన్యాలను కూడా స్వాధీనపరచుకున్నారు

నిజాంసాగర్ ఫ్లడ్ గేట్లు కూలిపోవడానికి కారణంపై విచారణ

శ్రీ నారాయణరెడ్డి డిమాండ్

హైదరాబాదు అక్టోబరు 28

నిజామాబాదు జిల్లాలోని నిజాంసాగర్‌కు రు 16 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన ఫ్లడ్‌గేట్లు కూలిపోవడానికి కారణాలుఏమిటో విచారణ జరిపించవలసిందిగా కాంగ్రెస్ శాసనసభ్యుడు శ్రీ యం నారాయణరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాల మూలంగా ఫ్లడ్‌గేట్లు కూలిపోయినందున, రిజర్వాయరులోని నీరు [illegible] పోతోందని ముఖ్యమంత్రి శ్రీ జె వెంగళరావుకు శ్రీరెడ్డి రాసినలేఖలో తెలియజేశారు రిజర్వాయర్‌లో ఎక్కువగావున్న నీటిని విడిచిపెట్టడానికి రెండు గేట్లు తెరవాలని ఆయన కోరారు గేట్లలో వున్న లోపం కారణంగా తర్వాత వాటిని క్రిందికి దించటం సాధ్యంకాదు. ప్రాజెక్టు గరిష్ట శక్తి 20 వేల క్యూసెక్కులు మాత్రమేననీ గత సంవత్సరంలాగ రిజర్వాయర్‌లోకి లక్ష క్యూసెక్కులకు మించి నీరుపోతే పెద్ద ప్రమాదం సంభవించివుండేదని ఆయన తెలిపారు

అరబ్‌లకు వ్యతిరేకంగా కిసింగర్ ఎత్తులు, జిత్తులు

సూయజ్ తూర్పు తీరానికి కొంచెం అవతలగా ఈజిప్టు రంగంలో పశ్చిమాసియా సమస్య పుట్టిపెట్టబడింది దాదాపుగా సినాయ్ ప్రాంతమంతా ఇజ్రాయిల్ చేతుల్లో ఉండిపోయింది సిరియన్‌రంగంలోని గోలన్ పర్వత శ్రేణులు ఇజ్రాయిల్ సాయుధ బలాలకు కీలకమైన అనుకూల స్థావరంగా వినియోగపడుతోంది.

ఇన్ని దగాబాజీ పనులు సాధించిన కి(ల్లాడి) సింగర్ ఒక పక్షం రోజుల వెనక తన రెండవ చాంద్రాయణాన్ని ప్రారంభించాడు ఇక మగ్గంలో అసులా తిరుగుతూ తన దౌత్య ప్రావీణ్యాన్ని వెలగబెట్టబోతాడు

నవ్వుల పువ్వులు రువ్వుతూ కిలాడీ కిసింగర్ ఇంద్రజాల మహేంద్రజాల గజకర్ణ గోకర్ణ టక్కు టమారవిద్యలెన్నో ప్రదర్శించబోతున్నాడు అయితే వెనకటిలా శ్రీ (సాలీడు కిసింగర్ అల్లే షడ్యంత్రం వంటి గూడులో ఎవరూ అంత తేలిగ్గా చిక్కుకొనే చిన్నెలు కనిపించటంలేదు అరబ్బులు కిసింగర్ అయమాయగారడీని ఎరిగిట్టారు అతగాడి తొలియాత్ర సమయంలో వాళ్ల బోల్తాపడిన మాటనిజమేగాని ఇప్పుడు వాళ్ళల్లో ఆనాడున్నంత అమాయకత్వం మిగిలివున్నట్లులేదు

క్రమంగా క్షీణిస్తున్న కిసింగర్ ప్రతిష్టకూ ప్రభావానికీ బోటుపెట్టి నిలబెట్టేందుకు గాను పశ్చిమాసియా యాత్రకు బయల్దేరుతున్న అమెరికా విదేశాంగమంత్రి కిసింగర్‌కు వీడ్కోలిచ్చేందుకుగాను అమెరికా ప్రెసిడెంట్ ఫోర్డు స్వయంగా అంద్రూస్ విమాన కేంద్రానికి వేంచేశాడు ఇంత చేసినా కూడా కిసింగర్ శాంతి పావురం రెక్కలకు తలసంకాశ పక్షవాతమే వచ్చింది

కిసింగర్ తాను బయల్దేరేందుకు సరిగా ముందు మరో తస్సా వదిలి చూద్దామనుకున్నాడు న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రతినిధి జేమ్స్ రెస్టన్ కిచ్చిన ఇంటర్వ్యూలో ప్రపంచం మరింతగా సహకార సాన్నిహిత్యం సాధించుకోవాల్సిన తరుణంలో అమెరికా మిగిలిన ప్రపంచానికి దూరంగా జరుగుతోంది అని విచారం వ్యక్తం చేశాడు.

ఆయన యింకా ఇలా వాపోయాడు: పరస్పరాధార సూత్రాన్ని మనం గుర్తించక పోయినట్లయితే ఈనాడు మనం దేన్నైతే పాశ్చాత్య నాగరకత అంటున్నామో అదికాస్తా ఛిన్నాభిన్నమైపోయే ప్రమాదముంది సంక్షోభాలు అంతకంతకు తీవ్రతరమవుతాయి అవి సైనిక ఘర్షణకు దారితీసినా తియ్యవచ్చు"

దీనంతటికి వెనుకనున్న దేమిటో తెలుసాండి: పశ్చిమాసియా సమస్య సమగ్ర పరిష్కారాన్ని అడ్డు కోవటం జెనీవా శాంతి సమావేశం జరగకుండా నిలిపి వుంచడం, అరబ్బు నాయకులకు అరచేతిలో వైకుంఠం కనిపించేట్లు కబుర్లు చెప్పి చివరకు కొద్దిపాటి "రాయితీలు కట్టబెట్టడం తద్ద్వారా అమెరికాకూ నాటో కూటమి దేశాలకూ వ్యతిరేకంగా అరబ్బు దేశాలు తమ నూనెను ఆయుధంగా వాడకుండా దిగదియ్యడం ఇదీ కిసింగర్ మంతనాల్లోని అంతర్యం

కిసింగర్ పశ్చిమాసియా యాత్ర ప్రధానోద్దేశం మరేమీ కాదు నూనె న్యూస్‌వీక్ పత్రిక కిసింగర్ అన్నాడని పేర్కొన్నదాన్నిబట్టి అరబ్బు దేశాలే తమకు తమ నూనె అమ్మకాలపై మరోమారు విధి విశేషాలంటూ పెట్టడమే సంభవిస్తే అమెరికా నేరుగా ఇజ్రాయెల్ గడ్డపై గట్టిగా నిలిచి ప్రతిఘటించాల్సి వస్తుంది వీటన్నింటికీ తోడు ఇజ్రాయిల్‌కు అత్యంతాధునికాయుధాలతో బాటు ఆయుధాల సప్లయిని అమెరికా కొనసాగిస్తూనే ఉంటుందని కిసింగర్ హామీ యిచ్చాడు

అమెరికా అల్జీరియాల మధ్య దౌత్య సంబంధాలను పునరుద్ధరిస్తామని అల్జీరియన్ ప్రెసిడెంట్ హౌరీ బౌమిడిన్‌కు హామీ యివ్వడంద్వారా అల్జీరియా మైత్రిని తిరిగిసంపాదించే ప్రయత్నం చేసేదాకా కిసింగర్ వెళ్ళాడు అయితే అందుకు అల్జీరియా చెల్లించాల్సిన మూల్యం కూడా ఉందనుకోండి అదేమిటంటారేమో నూనె సంక్షోభాన్ని పరిష్కరించడంలోను నూనె ధరలను అరబ్బు రాజ్యాలు మళ్ళీ పెంచెయ్యకుండా చూడటంలోను బౌమిడిన్ తోడ్పడాలి ఇదీ కిసింగర్ పెట్టిన చిన్న షరతు.

తన అడుగులకు మడుగులొత్తే సౌదీ అరేబియా రాజు ఫైజల్‌నుండి కూడా కిసింగర్ ఒక వాగ్దానాన్ని రాబట్టుకున్నాడు: నూనె ఉత్పత్తి చేసే దేశాలు ధరలు తగ్గించేలా ఫైజల్ తన పలుకుబడిని వినియోగించాలి ఇదీ ఒప్పందం

అరబ్బునాయకులు అక్టోబరు 26 నసమావేశంలో చేసేనిర్ణయాలను పరిశీలిస్తే వారి కళ్ళలో కిసింగర్ ఏ మాత్రం దుమ్ము కొట్టగలిగినదీ బోధపడుతుంది ఏది ఏమైనప్పటికీ కిసింగర్ దౌత్య ద్యూత ప్రావీణ్యం ధర్మమా అని సంక్షుభిత పశ్చిమాసియాలో సుస్థిర శాంతి స్థాపనాశక్యత కనుచూపు మేరలో కానరాకుండా పోయింది పశ్చిమాసియాలో శాంతి ప్రసక్తి హెన్రీ కిసింగర్‌కు పూర్వమూ కావట్లేదు, ఇకముందూ కాబట్టదు అతగాడికి కావలసిందల్లా అగ్గువ ధరకు నూనె అత్యంత ప్రీతిపాత్రమైన ఇజ్రాయెలును

ఈజిప్ట్‌లో అణు విద్యుత్కేంద్రం

సోవియట్ యూనియన్, ఈజిప్టుల మధ్య ఒప్పందం

కైరో, అక్టోబరు 28

సోవియట్ యూనియన్ ఈజిప్టులో 460 మెగావాట్ల శక్తికల అణువిద్యుచ్ఛక్తి కేంద్రాన్ని నెలకొల్పనున్నట్లు ఈజిప్టుప్రణాళికామంత్రి ఇస్మాయిల్ సాబ్రి అబ్దుల్లా నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు

ఈ నెలారంభంలో విదేశాంగమంత్రి ఇస్మాయిల్ ఫామీనాయకత్వంక్రిందమాస్కో వెళ్ళిన ఈజిప్టు ప్రతినిధివర్గం జరిపిన సంప్రదింపుల సందర్భంగా సోవియట్ యూనియన్‌తో పై ఒప్పందం జరిగినట్లు యిక్కడ జరిగిన పత్రికా గోష్టిలో ప్రసంగిస్తూ అబ్దుల్లా తెలిపారు

ఇటీవలి సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి లియొనిడ్ బ్రెజ్నెవ్‌కు ఈజిప్టు అధ్యక్షుడు అన్వర్ సాదత్‌కు మధ్య జరిగే సంప్రతింపుల్లో వివరాలు రూపొందించబడతాయని ఆయన చెప్పారు

డాలరుదొంగనోట్ల ముఠా పట్టుబడి

లాస్‌ఏంజెల్స్, అక్టోబరు 28

డాలరు దొంగనోట్లను ముద్రిస్తున్న ముఠాను నిన్న గూఢచారిశాఖవారు పట్టుకున్నారు దాదాపు రు 6 40 కోట్ల విలువ చేసే 100 డాలర్ల నోట్లను వారివద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు

ఈ సందర్భంగా 4 గురిని అరెస్టుచేశారు ఇంత పెద్దఎత్తున స్వాధీనం చేసుకోవటం అమెరికా చరిత్రలో ఎప్పుడూలేదు.

టూరిస్టు బస్ ప్రమాదంలో ఇద్దరు మృతి

హైదరాబాదు అక్టోబరు 23

కామారెడ్డి హైదరాబాద్ రూటులో జనగంపల్లి గ్రామం సమీపాన ఈనెల 27 న జరిగిన టూరిస్టు బస్ ప్రమాదంలో శ్రీ రెక్కల చిన్న వెంకన్న, శ్రీ చిన్న ఎరగంగగౌడ్ అనే ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు

ఆ బస్సులో ప్రయాణం చేస్తున్నమిగతా 48 మంది యాత్రికులు డ్రైవర్ క్లీనర్‌లు సురక్షితంగా వున్నారు

టన్ను చక్కెర ధర 140 పౌండ్లు

చెల్లింపుకు బ్రిటన్ అంగీకారం

లండన్ అక్టోబరు 28

కామన్వెల్తు దేశాలనుండి 6 48 900 టన్నుల చక్కెరకు టన్నుకు 140 పౌండ్ల చొప్పున చెల్లించడానికి బ్రిటన్ అంగీకరించినట్లు నేడిక్కడ ఒక ప్రకటనలో తెలియ చేసింది

ఈ సంవత్సరం ఆఖరుతో కాలపరిమితి ముగియనున్న కామన్వెల్తు చక్కెర ఒప్పందం ప్రకారం పైన తెలిపిన ఎక్కువ ధరను ఎగుమతి చెయ్యవలసి వుంది

ఆ సరుకులో ఆస్ట్రేలియాకు 1,08 850 టన్నులు ఫిజీఐలెండ్సుకు 13,700 టన్నులు, భారత్‌కు 18,700 టన్నులు మారిషస్‌కు 2 53 300 టన్నులు, స్వాజిలాండుకు 58 700 టన్నులు అంగ్విలాకు 11,200 టన్నుల చొప్పున కేటాయించబడ్డాయి

పాకిస్తాన్‌ను సంతృప్తి పరిచే విధానం

అద్వాని ఆరోపణ

చండీఘర్ అక్టోబరు 28

పాకిస్తాన్‌ను సంతృప్తిపరిచే విధానాన్ని భారత్ అనుసరించడంవలన రావీనదిపై ప్రాజెక్టును నిర్మించడంలో జాప్యం జేస్తున్నదని జనసంఘ్ అధ్యక్షులు శ్రీ అద్వాని నేడిక్కడ ఆరోపించారు

ఈ నదిపై డాం నిర్మించకపోతే దీనివలన లాభించేది పాకిస్తాన్ మాత్రమేనని ఆయన అన్నారు

గత అనుభవంద్వారా ఈ సంతృప్తి పరిచే విధానంవలన ఫలితాలు అంతలేదని రుజువైందని ఆయన అన్నారు.

సిమ్లా ఒప్పందంపై సంతకాలుచేయడం చారిత్రకమైన పొరపాటు అని ఆయన అన్నారు

సభలు సమావేశాలు

దివి తాలూకా ప్రజా నాట్యమండలి కళాకారుల సదస్సు 3 11 74 (ఆదివారం) వక్కలగడ్డలో జరుగుతుంది

జిల్లా ప్రజా నాట్యమండలి అధ్యక్షులు శ్రీ కొడాలి ఆదిశేషయ్య కార్యదర్శులు డి. వి. యస్ ఆర్ వి. సుబ్బారావు, వీరా పాల్గొంటారు.

సమాధానానికి కిసింగర్ నిరాకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 28

పాకిస్తాన్‌కు ఆయుధాల సరఫరాపై నిషేధాన్ని అమెరికా కొనసాగిస్తుందని యిచ్చిన హామీకి సంబంధించిన ప్రశ్నకు విదేశాంగ మంత్రి హెన్రీ కిసింగర్ సమాధానం చెప్పేందుకు నిరాకరించారు

చర్చల సందర్భంగా భారత ప్రభుత్వానికి అటువంటి హామి యివ్వటం జరిగిందా అని విలేకరులు కిసింగర్‌ను ప్రశ్నించారు దీనిపై పరస్పర విరుద్ధవార్తలొస్తున్నాయని వారు చెప్పారు

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు కిసింగర్ నిరాకరించి చర్చలపై అధికార ప్రతినిధి వివరణతో ప్రశ్నకు సమాధాన మివ్వటం జరిగిందన్నారు

శాసన సభ్యులకు పార్లమెంటరీ విధానాల్లో తోడ్పాటు

విద్యావేత్తల సంఘాలకు లోక్‌సభ స్పీకరు విజ్ఞప్తి

చండీఘర్ అక్టోబరు 28

పార్లమెంటరీ విధానాల సంప్రదాయాలు ప్రవర్తనాంశాలను శాసన సభ్యులకు తెలియజేయడంలో విద్యావేత్తల సంఘాలు రాజ్యాంగంలో పరిశోధనలు జరిపే యితర సంస్థలు సహకరించాలని లోక్‌సభ స్పీకరు శ్రీ జి యస్ ధిల్లాన్ నేడు విజ్ఞప్తి చేశారు

భారత రాజకీయశాస్త్ర 34 వ మహాసభ ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ పై విజ్ఞప్తి చేశారు అటువంటి సంస్థలు ఎన్నికల అనంతరం కొత్త శాసనసభ్యులకు శిక్షణ యివ్వాలని ఆయన చెప్పారు

అటువంటి కార్యక్రమాలు విద్యావేత్తలు రాజకీయ వేత్తలు, శాసనసభ్యులు పరస్పరం ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోడానికి తోడ్పడతాయనికూడా ఆయనఅన్నారు

కర్ణాటక ఉద్యోగులకు కరువుభత్యం పెంపు

బెంగుళూరు అక్టోబర్ 29

కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగులకు రు. 14 నుండి రు 54 వరకు కరువు భత్యాన్ని పెంపుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రకటించింది

పునర్ వ్యవస్థీకరించబడిన మంత్రివర్గం మొదటి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొనబడింది

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి కరువుభత్యం పెంపుదల వల్ల అదనంగా రు 4 కోట్లు వ్యయమవుతుంది.

రు. 32 వేల మత్తు పదార్థాల స్వాధీనం

హైదరాబాద్ అక్టోబరు 28

హైదరాబాద్‌లోని ఇసామియా బజార్, అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో గోదాములపై నిన్న సెంట్రల్ ఎక్సైజ్ అధికారులు దాడి జరిపి రు 32 వేల విలువచేసే గంజాయి, నల్లమందు భంగు స్వాధీనం చేసుకొన్నారు.

గత వారంరోజులనుండి తప్పించుకొని తిరుగుతున్న మత్తు పదార్థాలు అమ్మే డీలరును అరెస్టుచేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీ ఎస్ కె తెలియజేశారు

చైనా నుండి నేపాల్ రు. 9 కోట్ల సరుకుల దిగుమతి నిర్ణయం

ఖాట్మండు అక్టోబరు 29

చైనానుండి నేపాల్ జాతీయ వాణిజ్య సంస్థ రు 9 కోట్ల విలువచేసే సరుకులను ప్రస్తుత సంవత్సరంలో దిగుమతి చేసుకోవడానికి నిర్ణయించింది

గత సంవత్సరంకన్నా ఈ సంవత్సరం రు 3 కోట్లకు పైగా సరుకులను దిగుమతి చేసుకొంటుంది

ఈ సరుకుల్లో భారత్‌నుండి ప్రధానంగా సరఫరా చేయబడుతున్న సిమెంట్, ఇనుప కడ్డీలు లాంటి నిర్మాణ సామాగ్రి స్టేషనరీ పేపర్ లాంటివి వుంటాయి

చైనా నుండి ఆర్థిక సహాయం క్రింద రు 3 కోట్ల విలువైన సామాగ్రి అందులో భాగంగా వుంటుందని నేపాల్ అధికార వర్గాలు తెలిపాయి

విజయవాడ-బందరు సైకిల్ పోటీలు

విజయవాడ, అక్టోబరు 28

అయన్స్ క్లబ్ అధ్వర్యాన నిన్న జరిగిన సైకిల్ పోటీలో మొదటి బహుమతి పెదవల్లపూడికి చెందిన శ్రీ లింగినేని సూర్యప్రకాశరావుకు రెండవ బహుమతి ఆకునూరుకు చెందిన శ్రీ అరేపల్లి కోటేశ్వర రావు మూడవ బహుమతి [illegible] వాస్తవ్యులు శ్రీ తెన్నేటి [illegible] లభించాయి శ్రీ ఎస్ కె బాబులు (ఆర్ టి సి) శ్రీ ఈ రటి అంజనేయులుకు కన్సొలేషన్ బహుమతులు వచ్చాయి పోటీలో మొత్తం 38మంది పాల్గొన్నారు 9 మంది విజయవాడ తిరిగి వచ్చారు పోటీ విజయవాడ నుండి బందరువెళ్ళి తిరిగి రావడం

విజేతలు ఉదయం 7 45 గంటలకు పి. డబ్ల్యు డి గ్రౌండ్స్ నుండి బయలుదేరి మధ్యాహ్నం 1 30 గంటలకు విజయవాడ చేరుకున్నారు పోటీలకు బి జి పి. శ్రీ అబ్దుర్ సలాంఖాన్ ప్రారంభోత్సవంచేశారు జిల్లా కలెక్టర్ శ్రీ కె. ఆర్ వేణుగోపాల్ బహుమతులనందజేశారు.

ఆయిల్ మిల్లు కార్మికులపై గూండాల దాడి

పాకల పీకివేత

అదిలాబాద్, అక్టోబరు 28

ఈ నెల 21వ తేదీన పెన్‌గంగా ఆయిల్ మిల్లు కార్మికుల గుడిసెలపై గోవర్ధన్ జగ్‌మల్ ఠాకూర్ పాషా మరికొంతమంది గూండాలు దాడిచేసి ఆరు గుడిసెలను పీకివేశారు గూండాలు విచక్షణారహితంగా స్త్రీలను గుడిసెల్లోంచి బయటకు నెట్టివేశారు పిల్లలను బయటకు విసిరేశారు

పెన్ గంగా ఆయిల్ మిల్లు వర్కర్స్ యూనియన్‌ను ఇటీవలే ఏర్పాటు చేశారు యూనియన్ ఏర్పాటు చేశారనే కక్షతో ఫ్యాక్టరీ యజమాని స్థానిక కాంగ్రెసు ఎం ఎల్ ఏ మసూద్ అహ్మద్ ప్రోద్బలంతో ఈ దాడి జరిగిందని కార్మిక పేటలో అనుకుంటున్నారు

వారు ఇదివరకు యూనియన్‌ను చీల్చడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి

ఆయిల్‌మిల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శ్రీ [illegible] శ్రీ చంద్రకుమార్‌లు వెంటనే ఈ విషయం ఫోన్‌లో కలెక్టరుకు తెలియచేసి గుడిసెలదగ్గరకు వెళ్లేసరికే గూండాలు పారిపోయారు

అంతకుముందు సబ్ ఇన్‌స్పెక్టరుకు ఫోన్‌చేసి విషయం తెలిపితే ఆయన గుడిసెల వైపుకు రాలేదు

తర్వాత కలెక్టర్ పంపగా డి ఎస్ పి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గుడిసెల వద్దకువచ్చి గూండాలను పట్టుకుంటామని హామీఇచ్చారు

పెన్‌గంగా ఆయిల్‌మిల్లులో మామూలుగా రోజుకు 12 గంటలుపనిచేయిస్తున్నారు కూలి మూడున్నర నాలుగు రూపాయల చొప్పున ఇస్తున్నారు

రాత్రి షిఫ్టుకు కార్మికులు దొరకనిపక్షంలో కార్మికులతో బలవంతంగా 24 గంటలూ పని చేయించడం కూడా జరుగుతున్నది

ఈ నెల 22వ తేదీన కార్మికులు పెద్ద ప్రదర్శనగా కలెక్టరు వద్దకువెళ్ళి మెమొరాండం యిచ్చారు

వసుమర్రు గ్రామ పంచాయతీ

టెండరు నోటీసు

ROC No 108/74 Dt 20 10 74

నర్సరావుపేట తాలూకా వసుమర్రు గ్రామ పంచాయతీ తాలూకు స్టేషనరీ ఆర్టికల్సు మరియు లైటింగ్ ఆర్టికల్సు సప్లయి చేయుటకు ది. 30 10 74 సాయంత్రం 3 గంటలకు యీ క్రింది సంతకముదారునిచే సీల్డు టెండర్లు స్వీకరింపబడి అదే రోజు సాయంత్రం గం 3-30 ని॥లకు టెండరుదారుల సమక్షమున లేక వారి ఏజెంట్ల సమక్షమున తెరువబడును ఇతర వివరములు ఆఫీసు పనిచేయు వేళలందు తెలుసుకొనవచ్చును

చెల్లించవలసిన డిపాజిట్టు ప్రతి ఐటము ఒకటికి రు 50 00 లు

ఎగ్జిక్యూటివు ఆఫీసరు,
గ్రామ పంచాయతీ
వసుమర్రు, గుంటూరు జిల్లా.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

సవరణ

ఈ కార్యాలయముచే జారీ చేయబడిన చిట్ టెండరు నోటీసు నెం 20/డి4/74 తేది 30 9 74 నందు 3వ ఐటముగా ఉదహరింపబడిన ఈ క్రింది తెలుపబడిన పని సదరు చిట్ టెండరు నోటీసు నుండి ఉపసంహరింపబడినది

పనిపేరు : మెయిన్‌వర్కు : మద్రాసు - కలకత్తా రోడ్డు జాతీయ రహదారి నెం 5లో మై 504 నుండి 564 వరకు వెడల్పుచేయుట మరియు బలపరచుట.

సబ్‌వర్కు : ఈ మైళ్ళలో గల బలహీనమైన మరియు ఇరుకైన కల్వర్టుల పునర్నిర్మాణం

యస్ హనుమంతరావు,
సూపరింటెండింగ్ ఇంజనీర్ (అర్ & బి),
స్టేట్ రోడ్ సర్కిల్ విశాఖపట్టణం
ఇన్ అడిషనల్ ఛార్జి నేషనల్ హైవేస్
సర్కిలు, విశాఖపట్టణము,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పబ్లిక్ వర్క్సు శాఖ
గోదావరి బ్యారేజి ప్రాజెక్టు

టెండరు పిలుపు రద్దు

పనిపేరు : రైలు బ్రిడ్జికి ఇ యల్ + 12 8 M నుండి పూర్తి ఎత్తువరకు పైర్సు అబాట్‌మెంట్స్ వింగ్స్ రైజింగ్ చేయుట

టెండరు నోటీసు నెం 2/74-75కు సవరణ నెంబరు 1 నుండి 4 వరకు చేసిన సవరణలు రద్దుచేయబడినవి

ధవళేశ్వరము (533125)
తేది 20-9-1974

(సం) ఆర్ సి. రావు
సూపరింటెండింగ్ ఇంజనీర్, పి.డబ్ల్యుడి.
జి బి కన్‌స్ట్రక్షన్ సర్కిల్,
ధవళేశ్వరము 20 9.74

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

టెండరు నోటీసు

టెండరు నెం 4/AE/74 తేది 10-10-1974

ఈ క్రింది షెడ్యూలు ఎ లో తెలియజేయబడిన షరతులకు లోబడి గ్రామీణ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు సప్లయి చేయుటకు ప్రసిద్ధి చెందిన సంస్థల నుండి సీలు వేసిన టెండర్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రొటెక్టెడ్ వాటర్ సప్లయి) ఎర్రమ్ మంజిల్, పై యం పి ఎ. దగ్గర, నారాయణగూడ హైదరాబాదు - 500027 వారిచే ది 8 11 74 వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు కోరబడుచున్నవి టెండర్లు అదే రోజు సాయంత్రం గం 3 30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదార్లు లేక వారి ఏజెంట్ల సమక్షంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రొటెక్టెడ్ వాటర్ సప్లయి, హైదరాబాదు లేక వారిచే నియమింపబడిన వారిచే టెండర్లు తెరువబడును 8 11 74 ప్రత్యేకించి సెలవు రోజు అయినట్లయితే టెండర్లు ఆ తరువాత రోజు సాయంత్రం 3 గంటల వరకు తీసుకొనబడి అదే రోజు సాయంత్రం గం 3 30 ని॥లకు పైన తెలిపిన విధంగా తెరువబడును

షెడ్యూలు 'ఎ'

గ్రామం పేరు	నీటిలోవున్నమడ్డి	ప్రతిరోజూ 16 గంటలలో పంప్ చేయుటకుకావలసిన వాటర్ లీటర్లలో
తూర్పుగోదావరిజిల్లా		
1 ఆర్యావటం	2000 PPMనుండి 2500 PPM	1 50 150
2 వేళంగి	2000 PPMనుండి 2500 PPM	3 32 200
3 పండిపళ్ళం	2000 PPMనుండి 2500 PPM	3,91,100
4 భైరవపాలెం	2000 PPMనుండి 2500 PPM	1,33 750
కృష్ణా జిల్లా		
5 దొండపాడు	2000 PPMనుండి 2500 PPM	2 36 600
6 కోరుకొల్లు	2000 PPMనుండి 2500 PPM	3,89,025
శ్రీకాకుళం జిల్లా		
7 ఇంకొల్లు	2500 PPMనుండి 3000 PPM	4 55 000

నోట్ : 50 P P M వరకు క్లోరిన్ మొదలగునవి కలిసి మడ్డిని కంట్రోలు చేయుటకు ట్రీట్‌మెంట్ టెండరుదార్లు పై క్వాలిటీకి తగిన ప్లాంట్ ట్రీట్‌మెంట్‌కు రేటు కోట్ చేయాలి మరియు ట్రీట్‌మెంట్ ప్లాంటుతో కావలసిన లేఔటు తెలియచేయాలి

ప్రత్యేక షరతులు :

1 తెలియజేయబడిన విలువలో 2½ శాతం బ్యాంకు డ్రాఫ్టుగా లేదా బ్యాంక్ గ్యారంటీ రూపంలో చెల్లించాలి చెక్కులు ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించబడవు

2 బ్యాంకుద్వారా పంపినట్లు సమూనా యొక్క డాక్యుమెంట్లు చేరిన తరువాతనే 90 శాతం పేమెంటు చేయబడుతుంది

3 ఏదైనా ప్రత్యేకమైన ఎక్విప్‌మెంటు కావలసినచో రేటును కోట్ చేసేటప్పుడే టెండరులో తెలియజేయాలి

సూపరింటెండింగ్ ఇంజనీర్
పి డబ్ల్యు యస్
హైదరాబాదు

రేపే విడుదల!

ఉదయం ఆటతోప్రారంభం

ఈదిగువ కేంద్రములలో

1 విజయవాడ – అప్సర సినిమా హౌస్(A C)
2 విజయవాడ – శ్రీ దుర్గాకళామందిర్
3 గుంటూరు – కృష్ణ మహల్
4 గుంటూరు – లక్ష్మీ పిక్చర్ ప్యాలెస్
5 విశాఖపట్నం – అలంకార్ థియేటర్
6. విశాఖపట్నం – పరమేశ్వరి పిక్చర్ ప్యాలెస్
7 రాజమండ్రి – కుమారి పిక్చర్ ప్యాలెస్
8 రాజమండ్రి – లక్ష్మీ టాకీస్
9 కాకినాడ – విజై టాకీస్
10 కాకినాడ – థియేటర్ పద్మప్రియ
11 నెల్లూరు – కనక మహల్
12 నెల్లూరు – శ్రీ విజయా మహల్
13. తెనాలి – అలంకార్ టాకీస్
14 తెనాలి – రామకృష్ణా పిక్చర్ ప్యాలెస్
15 విజయనగరం – శ్రీ కృష్ణ సినిమా
16 విజయనగరం – కల్పన థియేటర్
17 ఏలూరు – శ్రీ రమా మహల్
18 ఏలూరు – శ్రీ వెంకటేశ్వర టాకీస్
19 భీమవరం – పద్మశ్రీ పిక్చర్ ప్యాలెస్
20 భీమవరం – వెంకట్రామా టాకీస్
21 మచిలీపట్నం – నటరాజ్ పిక్చర్ ప్యాలెస్
22. మచిలీపట్నం – నవకళా థియేటర్
23 గుడివాడ – నీలా మహల్
24 గుడివాడ – శ్రీ గంగా మహల్
25 ఒంగోలు – శ్రీ రామ్ పిక్చర్ ప్యాలెస్
26. ఒంగోలు – శ్రీనివాస డీలక్స్
27. చీరాల – శ్రీ గోపాలకృష్ణాటాకీస్
28. చీరాల – శాంతిథియేటర్
29 అమలాపురం – శ్రీనివాసమహల్
30. అనకాపల్లి – రాజా పిక్చర్ ప్యాలెస్
31 శ్రీకాకుళం – శ్రీ సూర్యమహల్
32 హైదరాబాద్ – శాంతి (A C)
33 హైదరాబాద్ – కమల్ టాకీస్
34. సికింద్రాబాద్ – పారడైజ్ (A C)
35 వరంగల్ – శ్రీ రాజరాజేశ్వరి టాకీస్
36 వరంగల్ – దుర్గా కళామందిర్
37 ఖమ్మం – సుందర్ టాకీస్
38 నిజామాబాద్ – అశోక్ టాకీస్
39 తిరుపతి – వి వి మహల్
40 కర్నూలు – అలంకార్ టాకీస్
41 కర్నూలు – వె రె టి
42 అనంతపూర్ – శాంతి
43 అనంతపూర్ – రఘువీర్ థియేటర్
44 బళ్లారి – రాయల్ టాకీస్
45. బళ్లారి – సంగం
46 కడప – శ్రీనివాస్
47 గుంతకల్ – వెంకటేశ్వర
48 మదనపల్లి – మల్లిఖార్జునపిక్చర్‌ప్యాలెస్

1-11-74 నుండి

49. హైదరాబాద్ – మీరా (A C)
40 తణుకు – నరేంద్ర చిత్ర మందిర్
51 తాడేపల్లిగూడెం – విజయా టాకీస్
52 చిత్తూరు – వెంకటేశ్వర (డీలక్స్)

2-11-74 నుండి

53 మద్రాసు – సుందరం (A C)



ఈస్ట్‌మన్‌కలర్

దర్శకత్వం తాతినేనిరామారావు

నిర్మాతలు జె సుబ్బారావు జి రాజేంద్రప్రసాద్

శ్రీ లక్ష్మీ ఫిలింస్

నేటిరాత్రి గం 9-30 లకు వివిధ భారతి వాణిజ్య విభాగంలో పై చిత్రంనుగూర్చి 'కుమారి చంద్రకళ' వ్యాఖ్యానంతో ప్రత్యేక రేడియో కార్యక్రమం వినండి.

భారతీయ కుటుంబాల రక్షణకు చర్యలు

త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టులో

ఖాట్మండు అక్టోబరు 28

త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టులో పని చేస్తున్న భారతీయ కుటుంబాల రక్షణ నిమిత్తం భారత రాయబార కార్యాలయం పోలీసు రక్షణ కోరినట్లు తెలియవచ్చింది

ప్రాజెక్టు స్థలంలో నివసిస్తున్న భారతీయ కుటుంబాలరక్షణకు నేపాల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వేతనాల పెంపుకు ఆందోళన చేస్తున్న ప్రాజెక్టు కార్మికులు గతవారం ఒక భారతీయ ఇంజనీర్‌ను ఘెరావ్ చేయడం జరిగింది

దసరా సెలవులనంతరం రేపు ప్రాజెక్టు పని ప్రారంభం కానున్న దృష్ట్యా ఏవైనా అవరోధాలు సంభవించే అవకాశం వుంది

ఢిల్లీ నుండి కేంద్ర జల విద్యుత్ కమిషన్ చీఫ్ ఇంజనీరు నిన్న యిక్కడకు వచ్చారు కార్మికుల వేతనాలపెంపుకు సంబంధించిన సమస్యను ఆయన పరిశీలిస్తారు

ఫిలిప్పీన్స్ తుపానులో 25 వేల మంది నిరాశ్రయులు

మనీలా అక్టోబరు 28

నేడు ఉత్తర ఫిలిప్పీన్స్‌లో సంభవించిన తుఫాను తీవ్రత్వంలో కనీసం 2౦ వేల మంది ప్రజలు కొంపాగోడీ కోల్పోయి నిరాశ్రయులయ్యారు ఆ తుఫాను దక్షిణ చైనా సముద్రంవైపు పయనించింది

గంటకు 18౦ కిలోమీటర్ల వేగంతో వీచిన తుఫాను గాలులకు కుండపోతగా కురిసిన వర్షాలలో ఇలోకోస్‌నర్, పాంగాసినన్‌రాష్ట్రాలలోఅనేక యిళ్ళు భవనాలు కూడాదెబ్బతినడంతో 2౦ వేల మంది ప్రజలు నిరాశ్రయులయారు

వరి పొగాకు పంటలు పండించే రాష్ట్రాలనుండి వార్తలు పూర్తిగా వస్తే ఎక్కువగానే నష్టం వుండవచ్చునని మనీలా లోని రెడ్‌క్రాస్ ప్రతినిధి తెలియ చేశారు

మనీలాకు ఉత్తరంగావున్న దగుపాన్ పట్టణంలోవున్న రెండు నదులకు విపరీతంగా వరదవచ్చి గట్లమీద నుండి పొర్లిపోతున్న దృష్ట్యా వందలాది ప్రజలు కుటుంబాలతోసహా రక్షిత ప్రాంతాలకు వెళ్ళారు

ఫిలిప్పీన్స్‌లో యీనెలలో నాలవసారి తుపాన్ సంభవించింది

కమ్యూనిస్టు పార్టీలో మార్క్సిస్టు పార్టీ సభ్యుల చేరిక

ఏలూరు అక్టోబరు 29

ఏలూరు తాలూకా పాలగూడెం గ్రామ మార్క్సిస్టుపార్టీ సభ్యులు, పానుగంటి ఎరులు యీ పన్నెండు మంది శ్రీ పి కృపానందం అధ్యక్షతన సమావేశమై భారతదేశంలో మార్క్సిస్టుపార్టీ అవలంబిస్తున్న విధానాలు వేస్తున్న ఎత్తుగడలు ఇతర పార్టీలతో కుదుర్చుకుంటూ వున్నపొత్తును సమీక్షించారు మార్క్సిస్టుపార్టీ సాగిస్తూ వున్న కార్యక్రమం చేస్తూవున్న ప్రచారం ప్రజా ఉద్యమాలకు శ్రామికవర్గ పురోగమనానికి ఆటంకం కలిగించటమేగాక అభివృద్ధి నిరోధకులను ప్రజా కంటకులను పోషించేదిగా స్థిరపడి పోయిందని మొత్తంగా భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు ఈ నెల 27, 28 తేదీలలో భీమడోలులో జరిగిన తాలూకా మహాసభకు ప్రతినిధులను కూడ పంపారు

నూతనంగా నిర్మాణమైన గ్రామకమ్యూనిస్టు కమిటీకి శ్రీ డి ఏడుకొండలరావు కార్యదర్శిగా డి మహాలక్ష్మి సహాయ కార్యదర్శిగా శ్రీయుతులు యస్ వెంకటేశ్వరరావు యస్ సుబ్బారావు, కె రామదాసు డి దేవానందం, పి రామదాసు పి కృపానందం టి మరియదాసులు కమిటీ సభ్యులుగా ఎన్నికైనారు

ఐక్య కమ్యూనిస్టుపార్టీలో భాగంగా ఈ గ్రామ యూనిట్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వ్యవసాయ కార్మికోద్యమానికి ఎంతో అండగా వుండేది

జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ ఇందుకూరి సుబ్బరాజు సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు

కమ్యూనిస్టు కార్యకర్తలపై దాడి

వరంగల్ అక్టోబరు 29

వరంగల్‌జిల్లా మడికొండగ్రామ కమ్యూనిస్టు కార్యకర్తలపై రైసులు ఇనుప కడ్డీలతో శ్రీయుతులు దువ్వ యాదగిరి రాజలింగం వీరమల్లు లింగమూర్తిల నాయకత్వాన 20 మంది స్థానిక గూండాలు దాడి చేశారు ఈ దాడి ఈనెల 2౦ న జరిగింది.

దాడిలో శ్రీయుతులు బి వెంకటయ్య పి విఠల్ రాజగోపాల్, బి మల్లయ్యలు తీవ్రంగా గాయపడ్డారు బి వెంకటయ్య, యం జి యం ఆసుపత్రిలో చేర్చబడ్డారు

విచిత్రమేమిటంటే ఊళ్ళోనే పోలీస్ స్టేషన్ ఉండి సబ్‌ఇన్‌స్పెక్టరుకూడా ఉండి ఏమీ చర్య తీసుకోలేదు వరంగల్‌నుండి వచ్చిన రిజర్వుపోలీసులు దుండగులను అరెస్టుచేసి, దెబ్బలుతిన్నవారిని ఆసుపత్రికి పంపారు.

మైలవరం, పులివెందుల కాలువ ప్రాజెక్టులు వెంటనే పూర్తిచేయాలి

కరువునివారణదృష్ట్యాఅవసరమనిముఖ్యమంత్రికిశ్రీవై.ఈశ్వరరెడ్డిలేఖ

ప్రొద్దుటూరు అక్టోబరు 29

కరువు నివారణకొరకు ఉద్దేశించబడిన కడపజిల్లాలోని మైలవరం ప్రాజెక్టు పులివెందుల బ్రాంచికాల్వలప్రస్తుత దుస్థితినిగూర్చి వివరిస్తూ వాటి నిర్మాణం నిరాటంకంగానూ సత్వరంగానూ పూర్తిచేయాల్సినఅవసరాన్ని తెలుపుతూ ఈ నెల 24 న ముఖ్యమంత్రి శ్రీ జె వెంగళరావుకు పార్లమెంటు సభ్యులు శ్రీ వై ఈశ్వరరెడ్డి ఒక లేఖ రాశారు

లేఖలోని అంశాలు యివి :

దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు కలలు గంటున్న గండికోట ప్రాజెక్టు యొక్క కుంచించబడిన రూపమే ప్రస్తుత మైలవరం ప్రాజెక్టు సుప్రసిద్ధ బ్రిటిషు ఇంజనీరు మెకంజీ స్కీము ప్రకారంగానీ కృష్ణా పెన్నారు ప్రాజెక్టు పథకం ప్రకారం గానీ దాదాపు రెండు లక్షల యకరాలకు నీటి పారుదల సౌకర్యం లభ్యమయ్యే ఈప్రాజెక్టు 76వేల యకరాలకు మాత్రమేకుదించబడింది పైగా యీ కొద్ది ఆయకట్టుకుఅవసరమైన 9 15 టి యం సి ల నీరుకుగాను అందులో యెక్కువభాగం, అనగా 5 21 టి యం సి ల నీటికి ఏమాత్రం గ్యారంటీ లేని పెన్నానది వరదలపై ఆధారపడేటట్లు చేశారు సర్వసాధారణంగా కాలువ కొనన వున్న ఆయకట్టుదార్లకు నీటికొరతవల్ల ఏగతి పట్టుకుందో అదే విధంగా తుంగభద్ర ఎగువకాలువకొనవున్న మైలవరంప్రాజెక్టు క్రింది ఆయకట్టుదార్లకు ప్రభుత్వం అదేగతి తెచ్చి పెట్టుతోంది దీని మొదటి అంచనా దాదాపు ౨ కోట్ల రూపాయలు మాత్రమే కానీ నిర్మాణంలో జాప్యము జరిగి ధరలు పెరుగుతూ రావడంవల్ల అయిదు నుండి యెనిమిదై, అంతటితో ఆగక ప్రస్తుతం 12 కోట్లకు యెగప్రాకింది ఈ పెరుగుదల యింతటితోఆగుతుందనే భరోసాకూడాలేదు

విధులకోత, పనిలో తిరోగమనం

అష్టవక్రంగా తయారైన ఈ ప్రాజెక్టునైనా సత్వర కరువు నివారణ అవసరం రీత్యా దీని నిర్మాణాన్ని ప్రభుత్వం అందుకు తగినట్టుగా కొనసాగిస్తున్నదా అని అంటే అది ఏకోశానా కానరావడం లేదు దీని నిర్మాణం ప్రారంభమై తొమ్మిది సంవత్సరాలైంది కానీ గత ఎనిమిది ఏండ్ల కాలంలో ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ఖర్చుపెట్టినది రెండుకోట్ల యిరవై అయిదు లక్షల రూపాయలు మాత్రమే ఈ విధంగా కొనసాగితే దీని నిర్మాణం మూడు దశాబ్దాలకైనా పూర్తి కాదు 74 75 సంగకు గాను బడ్జెట్‌లో 107 లక్షలరూపాయలు కేటాయించబడింది కానీ కేటాయించబడిన మూడు మాసాల్లోపుననే ఆ మొత్తంలో సగానికి పైగా కోతకోసి 47 లక్షలకు కుదించబడింది కోత కోసిన మొత్తం నాగార్జునసాగరు ప్రాజెక్టుకు మళ్ళించబడిందనే వార్త ఈ ప్రాంత ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది దీని నిజానిజాలు ఎలా వున్నా యిలా కోతకోసి పనిని స్తంభింప జేయడం యే మాత్రం క్షంతవ్యము కాదు ప్రాంతీయ పక్షపాతాలు నగ్నంగా ప్రదర్శిస్తూ యిటు రాయలసీమలో బియ్యం రేషన్లు అతిహీనంగా యిచ్చి ప్రజలను పస్తులుపెటుతూ అది చాలక వారి భవిష్యత్తుకు కాస్తోకూస్తో ఉపయోగపడే యీ ప్రాజెక్టులనుకూడా పస్తులు పెట్టడంలో ఏమిటి మీ వుద్దేశం ? 5 రోజుల క్రిందటనే ఈ వార్త తెలిసి మైలవరం ప్రాజెక్టు వద్దకుపోయి స్వయంగా అక్కడ పరిస్థితిని గమనించాను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుతో కూడా మాట్లాడాను మెషినరీ అంతా కదలక మెదలక పడి వున్నది పనిలో వున్న కార్మికుల సంఖ్య చాలా తక్కువగా కనబడింది హెడ్ మజ్దూర్లు వర్క్ ఇన్‌స్పెక్టర్లు మేస్త్రీలు ఆపరేటర్లు క్లీనర్లు మెకానిక్కులు మొత్తం 47మందిని పనిలో నుండి తొలగించినారు ఏ ప్రాజెక్టు నిర్మాణంలోనైనా యేటికేటికి కేటాయింపులు పెంచుతూ త్వరితంగా ముగించే యేర్పాట్లు చేయడం మామూలు కానీ మైలవరం ప్రాజెక్టు ఎవుంలో 8 సంవత్సరాలు గడిచిపోయినా పురోగమనం ఆగిపోయి తిరోగమనం ప్రారంభం కావడం అత్యంత విచారకరం

పులివెందుల కాలువ

పులివెందుల బ్రాంచి కాలువ పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది దీని నిర్మాణాన్ని ప్రభుత్వంచేత అంగీకరింపజేసేందుకే పులివెందుల తాలూకా రైతాంగము అతి తీవ్రమైన నీరోచిత పోరాటము కొనసాగించవలసి వచ్చింది నిరంతర కరువు ప్రాంతమైన ఆ తాలూకాకు నీటి పారుదల సౌకర్యం కలిగించే ఈ ప్రాజెక్టు మినహా వేరే అవకాశమే లేదు రాయలసీమ ప్రజల దురదృష్టంకొద్దీ అలనాటి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి అభివృద్ధి పన్ను దాదాపు రు 70 లక్షలు కంతులుగా ముందుగా చెల్లిస్తేతప్ప పనిని చేపట్టడం జరుగదన్నారు కేవలం కరువు నివారణ కొరకే వుద్దేశించబడిన ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ముందుగానే అభివృద్ధి పన్ను చెల్లించాలనే షరతు పెట్టడం రాయలసీమలో తప్ప ఆంధ్రప్రదేశ్‌లో యే ప్రాంతంలో కానీ మొత్తం భారత దేశంలో యెన్నడుగాని వినివిని యెరుగము పైగా, ఆనాటి స్థానిక శాసనసభ్యులు శ్రీ పి బసిరెడ్డి దీనిని బలపర్చడం తర్వాత తత్సంబంధమైన శాఖకే మంత్రిగా వచ్చినా దాన్ని రద్దుచేయక పోవడం ఘోరం కాని ప్రజాప్రతినిధి కానటువంటిఅడ్వైజర్ల పరిపాలనలో శ్రీ కరీన్ ప్రజల న్యాయమైనకోర్కెను మన్నించి అధ్వాన్ను అభివృద్ధిపన్నును రద్దుపరచడం ప్రమోదకరమైన ఆశ్చర్యం

ఈ ప్రాజెక్టు క్రింది ఆయకట్టు 60 వేల యకరాలు దీని ప్రథమ అంచనా దాదాపు 3 కోట్ల రూపాయలు మాత్రమే ప్రస్తుతపు అంచనా ౬ కోట్లకుపైగావుంది దీని నిర్మాణం 1971 సంగలో ప్రారంభించబడి 50 లక్షల రూపాయలు మాత్రమే ఖర్చుపెట్ట బడింది. అందులో 20 లక్షలు యంత్ర సామగ్రికే వినియోగించబడింది పైగా దీనికి ప్రత్యేక డివిజను యేర్పాటుచేసి పని చురుకుగా సాగించకుండా యిది మైలవరం ప్రాజెక్టు డివిజను క్రిందనే వుంచబడింది ప్రక్కనే వున్నగాజులదిన్నెప్రాజెక్టుకుప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేసినప్పుడు, అదే అంచనాకలిగిన పులివెందుల బ్రాంచి కాలువకు యెందుకు ప్రత్యేక డివిజను యేర్పాటు చేయ లేదో బోధపడదు అడుగడుగునా వివక్ష చూపించి పాలించడమేనా స్వరాష్ట్ర ప్రభుత్వపు నీతి కూడా ?

కరువుబాధ కొంతమేరకైనా తొలగాలంటే

పై రెండు ప్రాజెక్టులు పూర్తయిననాడు జమ్మలమడుగు ప్రొద్దుటూరు కమలాపురం పులివెందులతాలూకాల్లో ఒకలక్షముప్పైవేల యకరాలకునీరందకలిగికొంతమేరకైనాకరువు బాధ తొలగుతుంది స్వరాజ్యం అప్పైన స్వరాష్ట్రం వచ్చిన తర్వాత కరువు బాధితులకు ఎన్నో ఆశలు కల్పించి ఆచరణలో అంతకంటే యెక్కువగా నిరాశ నిస్పృహలు కలిగించారు పట్నూత్రపథకం ఆమోదించిన ఫలితంగానైనా ప్రభుత్వ వైఖరిలో మార్పు వస్తుందని ఆశించాము కానీ పై ప్రాజెక్టులకు పట్టిన దుర్గతి చూచినప్పుడు తిరిగి కథ అడ్డం తిరిగిందేమోనని భావించవలసి వస్తున్నది ఇటీవల మీరు విశాఖ పట్టణంలో వచ్చే నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయవలసిన నీటి పారుదల ప్రాజెక్టులను గూర్చి ప్రస్తావించిన సందర్భంలో నాగార్జున సాగరు పోలవరం పాడు గోదావరి బ్యారేజి, వంశధారలను మాత్రమే పేర్కొని, రాయలసీమలోని ఎత్తైన మేజరు ఇరిగేషను ప్రాజెక్టయిన తుంగభద్ర ఎగువ కాలువను గూర్చి, పులివెందుల బ్రాంచి కాలువను గూర్చి వల్లెత్తు మాటైనా అనకపోవడం రాయలసీమ ప్రజల హృదయాలనెంతో గాయ పర్చింది ఈ వైఖరే కృష్ణాజలాలమళ్ళింపువిషయంలో కూడా ద్యోతకమౌతున్నందుకు రాయలసీమ ప్రజ తీవ్ర ఆందోళన చెందుతున్నది. న్యాయ సమ్మతమైన ఈ అనుమానాలను, ఆందోళనలను నివారించగలరనే విశ్వాసంతో పై ప్రాజెక్టుల సత్వర నిర్మాణానికి తగినంత డబ్బును కేటాయించి తొలగించబడినవారిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకొని పులివెందుల కాలువకు ప్రత్యేక డివిజను యేర్పాటుజేస్తూ యింకా అవసరమైన చర్యలు చేపట్టుతూ, చిరకాలంగా మా జిల్లా ప్రజలు అనుభవిస్తున్న కరువుబాధ నుండి కొంత మేరకైనా విముక్తుల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను అని తమ లేఖలో ఆయన కోరారు

కె. సి. కెనాల్ కింద భూములకు ఎరువులు లభించని స్థితి

నందికొట్కూరు అక్టోబరు 27

నందికొట్కూరు తాలూకాలో కె సి కెనాల్ కింద ఆగస్టు మొదటివారంలో నాట్లు పడినాయి అయితే ఇప్పటి వరకూ కార్డులపై అనేక మంది పేద రైతులకు ఎరువులు బొత్తిగా లభింప లేదు ధనిక రైతులు మాత్రం వ్యవసాయశాఖ అధికార్లను "కూడగట్టుకుని కావలసినన్ని ఎరువులు సాధించుకున్నారు అధికారు వేల రూపాయలు సంపాయించారని ప్రజలు అనుకుంటున్నారు

ఈ ప్రాంతంలో వరి పొట్టకు వచ్చింది వెంటనే ఎరువులువేస్తే తప్ప మంచి పంట పండదు పేద రైతులు ఆఫీసులచుట్టూ తిరిగి తిరిగి నిరాశ చెందుతున్నారు

ఈ నెల 18 వ తేదీన ఆత్మకూరు తహశీల్‌దార్ సబ్ ఇన్‌స్పెక్టర్ యడవల్లి వద్ద ఎరువులతో గుంటూరు వెడుతున్న లారీని పట్టుకొని 36 బస్తాల యూరియాను స్వాధీనం చేసుకున్నారు (వి. వి.)

కమ్యూనిస్టు కార్యకర్తపై భూస్వాముల దాడి

ఖమ్మం తాలూకా వాగిలి గొండలో

ఖమ్మం, అక్టోబరు 28

ఖమ్మం తాలూకా నాగిలిగొండ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త శ్రీ వెలిశాల పుల్లయ్యను హత్యచేయాలనే తలంపుతో స్థానిక భూస్వాములు జమ్ముల నారాయణరెడ్డి గడ్డం గోపయ్య, ఏపూరి వెంకయ్య మొదలైన 15 20 మంది గూండాలుకర్రలు బరిసెలతో పట్టపగలు దాడి చేసివిపరీతంగాకొట్టారు కేకలువిని సమీపంలో వున్నవారు ఇతన్ని రక్షించేందుకు రాగా గూండాలు వారిని కూడా తరిమివేసి దెబ్బల వల్ల కాలుచేయి విరిగి చావుబ్రతుకులమధ్యలో వున్న శ్రీ పుల్లయ్యను స్థానిక భూస్వామి జమ్ముల శ్యామసుందరరెడ్డి గడిలో బంధించారు ఈ విషయం చింతకాని పోలీసులకు తెలిసిన వెంటనే పోలీసులు వెళ్ళి గడిలో వుంచిన పుల్లయ్యను బయటకుతీసి ఖమ్మం ఆస్పత్రిలో చేర్చారు ఈఘటన తెలియగానే ఖమ్మంనుంచి డి యస్ పి, సర్కిల్ ఇనస్పెక్టర్ ఆ గ్రామం వెళ్ళి పరిస్థితి విచారించారు

బంచరాయి ఆక్రమణ

ఆగ్రామంలోవున్న బంచరాయినంతా స్థానిక భూస్వాములు ఆక్రమించుకున్నారు భూస్వాముల స్వాధీనంలోవున్నబంచరాయిని స్థానిక పేద ప్రజలు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన ఆక్రమించుకొని దున్నుకుంటున్నారు యింతలోనే భూస్వాములు ప్రజలపైన కేసులుమోపి భూములపైకిరానీయకుండా చేశారు. రెవిన్యూ అధికార్లు కూడా భూస్వాముల అధ్వాలోవున్న భూములను విడిపించడంలో జాప్యం చేశారు యింతలోనే స్థానిక కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలను ఒకరిద్దరిని చంపిఅయినా భూములు దక్కించుకోవాలని భూస్వాముల పథకం ప్రకారమే శ్రీ పుల్లయ్యపైన దాడిచేసి కొట్టారు అంతకుముందు దండా మంగయ్య అనే వ్యవసాయ కార్మికుడిని 13 వ తేదీన కొట్టి బంధించగా పోలీసులు వచ్చి విడిపించారు. (వి వి)

పట్టాలుతప్పినజనతా ఎక్స్‌ప్రెస్ ఇంజన్

కలకత్తా, అక్టోబరు 28

మద్రాస్ హౌరా జనతా ఎక్స్‌ప్రెస్, హౌరా ఖరగ్‌పూర్ ప్యాసింజర్‌తో గుద్దుకోవడంతో ఎక్స్‌ప్రెస్ ఇంజన్ పట్టాలు తప్పింది. హౌరా యార్డులో ఈ ఘటన జరిగింది

సభలు-సమావేశాలు

శ్రీకాకుళంజిల్లా ప్రజానాట్య మండలి విస్తృత కార్యవర్గ సమావేశం నవంబరు రెండవతేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు ఒంగోలు కమ్యూనిస్టుపార్టీ కార్యాలయంలో జరుగుతుంది. రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధానకార్యదర్శి శ్రీ నల్లూరి వెంకటేశ్వర్లు ఈ సమావేశంలో పాల్గొంటారు

రేడియో

గురువారం – అక్టోబరు 31

శక 1896 కార్తీక 9

హైదరాబాద్ – (ఎ)

405 4 మీ (7140 కిలోసై)

6 00 వందేమాతరం: 6 02 మంగళధ్వని కార్యక్రమ వివరణ: 6 10 భక్తిరంజని: నారాయణదాస్, త్యాగరాజ కృతులు: 7-15 కిరాతార్జునీయం కేశవపంతుల నరసింహ శాస్త్రి: 7-30 లలితసంగీతం: పి బి శ్రీనివాస్ జమునా రాణి జిక్కి పెద్దన్న: 7 4౦ చెంబై వైద్యనాథభాగవతార్: 11 4౦ మాధ్యమిక పాఠశాలలకు: 12 0౦ వి లక్ష్మి 1 10 చిత్రసీమ: ముగ్గురు అమ్మాయిలు కీలుబొమ్మలు తిరుపతి అనురాగం: 5 30 వి. లక్ష్మి: 7 4౦ చిత్రసీమ: మంచి మనసులు జగదేక వీరుడు, రాధమ్మ పెళ్ళి పవిత్ర హృదయాలు 8 15 లలితసంగీతం ఎమ్ వెంకట గోపాలన్: 8 45 జానపద గేయాలు వి నాగయ్య బృందం: 9 1౦ వి లక్ష్మి: 9 30 సంస్కృత నాటిక 10 00 నేదునూరి కృష్ణమూర్తి గాత్రం: 11 00 టి ఆర్ మహాలింగం వేణువు ఎస్ శే వేణువు 12 00 ప్రసార సమాప్తి.

విజయవాడ

357 1 మీ (1380 కిలోసై)

6 00వందేమాతరం: 6 0౦భక్తిరంజని: దేశభక్తి గేయం వెంకటాద్రి స్వామి కీర్తనలు సన్మతి గీతాలు: 7-4౦ సంగీతశిక్షణ జూనియర్లకు: 8 20 అన్నవరపు నాగభూషణం నాదస్వరం 11 45 మాధ్యమిక పాఠశాలలకు 12 0౦ బేబి గాయత్రి – వీణ: 1 20 చిత్రతరంగిణి పునర్జన్మ అనురాగం: 2 10 అన్నవరపు నాగభూషణం నాదస్వరం 6 20 చిత్రతరంగిణి: చదువుకున్న అమ్మాయిలు: 6 30 జానపద గేయాలు: 7 4౦ యువవాణి: 8 35 యువవాణి లలిత సంగీతము: 9 30 సంస్కృత నాటిక: 10 00 నేదునూరి కృష్ణమూర్తి గాత్రం: 11 00 టి ఆర్ మహాలింగం వేణువు, ఎస్ శే వేణువు: 12-00 ప్రసార సమాప్తి.



3 11-74 తేదీ మధ్యాహ్నం గం 3-15 ని లకు పై చిత్రంపై రేడియో సిలోన్‌లో (సంధ్యారాగం) సంగీత దర్శకులు శ్రీ చక్రవర్తి వ్యాఖ్యానంతో ప్రత్యేక రేడియో కార్యక్రమం వినండి

విశాలాంధ్ర విజ్ఞానసమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్: టి వెంకటేశ్వరరావు
ఎడిటర్: సి రాఘవాచారి, ముద్రణ: స్వతంత్రఆర్ట్‌ప్రింటర్సు
విజయవాడ 520004 RNo 1138/57